ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
గురువారం 4 జూలై 2024

నేటి నుంచి 'సదరమ్' స్లాట్ బుకింగ్‌లు

కలికిరి, జూలై 3: దివ్యాంగుల్లో ఉన్న వైకల్య స్థాయిని శాస్త్రీయంగా నిర్ధారించేందుకు అవసరమైన స్ర్కీనింగ్ పరీక్షల కోసం గురువారం నుంచి స్లాట్ బుకింగ్‌లు ప్రారంభం కానున్నాయి. అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లోనూ, మీసేవా కేంద్రాల్లోనూ తగిన వివరాలు అందజేసి అనుకూలమైన తేదీని, పరీక్షా కేంద్రాన్ని ఎంపిక చేసుకునేందుకు నమోదు చేసుకోవచ్చు. జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించి అవసరమైన తేదీని దివ్యాంగులు తమకు అనుకూలంగా ఎంపిక చేసుకోవచ్చు. శారీరక, మానసిక, ఈఎన్‌టీ, నేత్ర వైకల్యాన్ని నిర్ధారించేందుకు ఎంపిక చేసిన కేంద్రాల్లో స్ర్కీనింగ్ పరీక్షలు జరపనున్నారు. అనంతరం ఆయా దివ్యాంగులకున్న వైకల్య శాతాన్ని నిర్ధారించి సర్టిఫికెట్లు జారీ చేయనున్నారు. మూడు నెలలకు కేటాయించిన స్లాట్‌లు పూర్తి కావడంతో తిరిగి రాబోయే మూడు నెలల కాలానికి అంటే సెప్టెంబరు 30వ తేదీ వరకు అవసరమైన స్లాట్‌లను గురువారం నుంచి విడుదల చేయనున్నారు. ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, పాఠశాలలు, విద్యాలయాల్లో ప్రవేశాలు, రైల్వే-బస్సు ప్రయాణాల్లో రాయితీలు, ప్రధానంగా సామాజిక పింఛన్లు పొందడం కోసం సదరం కేంద్రాలు జారీ చేసే వైకల్యానికి సంబంధించిన నిర్ధారణ సర్టిఫికెట్లు మాత్రమే చెల్లుబాటవుతాయి. శారీరక, మానసిక, ఈఎన్‌టీ, నేత్ర వైకల్యాన్ని నిర్ధారించేందుకు ఆయా నిపుణులు స్ర్కీనింగ్ పరీక్షలు చేసి ఈ సర్టిఫికెట్లు జారీ చేస్తారు. జిల్లాలోని ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలు (ఏరియా ఆసుపత్రులు), జిల్లా ఆసుపత్రులు, బోధనా ఆసుపత్రుల్లో సదరమ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈసారి ప్రధానంగా సామాజిక పింఛన్ల కోసం దివ్యాంగులు సదరమ్ సర్టిఫికెట్లు పొందడానికి ఎదురు చూస్తున్నారు. కొత్తగా పింఛన్ల కోసమే కాకుండా గత ప్రభుత్వంలో తొలగించిన పింఛనుదారులు కూడా ఈ సర్టిఫికెట్లు పొందడానికి ప్రయత్నిస్తున్నారు.

కృత్రిమ కాళ్లు అమర్చడం కోసం ప్రత్యేక క్యాంపు

కాళ్లు కోల్పోయిన దివ్యాంగులకు కృత్రిమ కాళ్లను అమర్చడం కోసం ఈనెల 25వ తేదీ గురువారం కడప, అన్నమయ్య జిల్లాల కలెక్టరు కార్యాలయాల్లో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు. కడప జిల్లా కలెక్టరు కార్యాలయం డి-బ్లాకులోనూ, అన్నమయ్య జిల్లాకు సంబంధించి రాయచోటిలోని జిల్లా కలెక్టరు కార్యాలయంలోనూ ఒకేసారి ఈ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఆయా జిల్లాలకు సంబంధించిన వారు మాత్రమే ఆయా జిల్లా కేంద్రాల్లో హాజరు కావలసి ఉంటుంది. ఈ శిబిరాలకు హాజరైన వారు కోరుకునే కృత్రిమ కాళ్ల కొలతలు తీసుకుంటారు. ఆపై 20 రోజుల తరువాత రూ.51 వేల విలువ గల తేలికపాటి కృత్రిమ కాళ్లను ఉచితంగా అమరుస్తారు. అవసరమైన దివ్యాంగులు ఈనెల 18వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకుని నిర్ణీత తేదీనాడు స్వయంగా హాజరు కావలసి ఉంటుంది. శిబిరానికి హాజరయ్యే వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, మెడికల్ (సదరమ్) సరిఫికెట్ల జిరాక్సు కాపీలు, రెండు ఫొటోలు, మొబైలుతో హాజరు కావలసి ఉంటుంది. పేర్లు నమోదు కోసం కడప జిల్లాకు చెందిన వారు 99664 45110 లేదా 80746 23993 (హుస్సేన్), అన్నమయ్య జిల్లాకు చెందిన వారు 91827 78324 (రమేష్)లను సంప్రదించవచ్చని కలికిరి ఎంపీడీవో రామకృష్ణయ్య తెలిపారు.

పకడ్బందీగా కుష్టు వ్యాధి సర్వే

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కొండయ్య

రాయచోటిటౌన్, జూలై 3: ఇంటింట కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే పకడ్బందీగా చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య పిలుపునిచ్చారు. బుధవారం రాయచోటి పట్టణంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ శైలజ, డీఎన్ఎంవో డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డిలతో కలిసి కుష్టువ్యాధి సర్వే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కొండయ్య మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు ఇంటింట కుష్టు వ్యాధి సర్వేని ఆశా కార్యకర్తలు, ఎంపిక చేసి శిక్షణ ఇవ్వబడిన స్వచ్ఛంద సేవకులు చేస్తారని తెలిపారు. స్పర్శ లేని లేని మచ్చలు రాగి రంగులో ఉంటాయని, మచ్చల పైభాగంలో వెంట్రుకలు ఉండవని, నొప్పి ఉండదని, మెరుస్తూ ఉంటాయన్నారు. శరీరంలో ఏ భాగంలోనైనా ఈ మచ్చలు ఉండవచ్చునన్నారు. ఒక సంవత్సరం పాటు మందులు క్రమం తప్పకుండా వాడాలని, కుష్టువ్యాధికి చికిత్స ప్రభుత్వం పూర్తిగా ఉచితంగా అందజేస్తుందన్నారు. కుష్టువ్యాధి సర్వేలో ఆశా కార్యకర్తలు, శిక్షణ పొందిన మగ వలంటీర్ ఒక టీమ్‌గా వెళ్లి సర్వే చేస్తారని, ఈ సర్వేకు ప్రజలు సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో దేవశిరోమణి, పీఎంవో రవికుమార్, డీఎంవో వేణుగోపాల్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య

ఆర్టీవో కార్యాలయంలో.. కోడ్ భాషతో అక్రమాలు

● డీసీబీ (మామూళ్లు) రేట్లు పెంచేశారు
● ఇన్సిల్ ఉంటే..ఫైల్ ఓకే ● వాహనం రైట్..రైట్..
● కొత్త వాళ్లయితే నిరీక్షణే





ఆర్టీవో కార్యాలయం

మదనపల్లె, జూలై 3: మదనపల్లె రోడ్డు ట్రాన్స్‌పోర్టు కార్యాలయం (ఆర్టీవో) అక్రమాలకు అడ్డాగా మారింది. ఇక్కడ అధికారులు, సిబ్బంది నిత్యం అక్రమాలను రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయించారు. వినియోగదారుడు సేవలు పొందే క్రమంలో ప్రభుత్వానికి చెల్లించే చలానా ధరల్లో ఏమాత్రం తేడా లేదు. కానీ ఆర్టీవో ఏజెంట్లు, డ్రైవింగ్ స్కూల్స్ నిర్వాహకులు, ద్విచక్ర వాహనం, నాలుగు, పది చక్రాల వాహన యజమానులు, డ్రైవర్ల నుంచి వసూలు చేసే డీసీబీ రేట్లు మాత్రం విపరీతంగా పెంచేశారు. ఇక్కడ డీసీబీ అంటే సామాన్యులకే కాదు..ఆర్టీవో కార్యాలయంలో సేవలు పొందని ఎవరికీ ఈ కొత్త పథకం గురించి తెలీదు. ఇక్కడ కార్యాలయంలో డైరెక్ట్‌గానో లేక ఆర్టీవో ఏజెంట్ ద్వారానో సేవలు పొందిన ప్రతి ఒక్కరికీ తెలుస్తుంది. డీసీబీ అంటే అదే..లంచం, మామూళ్లు అనే పదం. మోటారు వాహనాల తనిఖీ అధికారి కార్యాలయంలో ఈ కోడ్ భాషను ఉపయోగిస్తున్నారు. ఇక్కడ తరచుగా చలానాతో పాటు డీసీబీ పదాన్ని వాడుతుంటారు. అలాగే దరఖాస్తు, ఫైల్‌పై కోడ్‌తో కూడిన ఏజెంట్‌ను తెలిపేలా పెన్సిల్‌తో సైన్ ఉంటేనే ఫైల్ కదులుతుంది. వాహనం రైట్.. రైట్ అంటూ..ముందుకెళ్తుంది. రిజిస్ట్రేషన్ కార్యాలయాలుగా చెప్పుకునే ఆర్టీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మామూళ్లు మామూలే అయినా..డీసీబీ రేట్లు పెంచడం దారుణమంటున్నారు వినియోగదారులు, ఏజెంట్లు. పెంచిన ధరలు ఇక్కడ రెండేళ్లుగా అమలులో ఉన్నట్లు వాహనదారులు, వినియోగాదారులు వాపోతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం, అంతకుమించీ అడిగేవారు లేకపోవడంతో వారు చేసిందే చెకింగ్.. ఇచ్చిందే లైసెన్సుగా మారింది.

మదనపల్లె కేంద్రంగా వాహనదారులకు సేవలు చేస్తున్న ఆర్టీవో కార్యాలయంలో ఎప్పటికప్పుడు అక్రమాలు కూడా రిజిస్ట్రేషన్ అవుతున్నాయి. ప్రభుత్వ అధికారులతో పాటు ప్రైవేటు వ్యక్తులూ మామూళ్ల సేవలు అందిస్తున్నారు. అటు ప్రభుత్వానికి, ఇటు వినియోగదారులకు మధ్య వారధిగా వ్యవహరిస్తూ ఎప్పటికప్పుడు కార్యాన్ని చక్కదిద్దుతున్నారు. ఆర్టీవో ఏజెంట్లు, డ్రైవింగ్ స్కూల్స్ నిర్వాహకుల నుంచి వచ్చే ఫైళ్లను పట్టుకుని వాహనాన్ని చెక్ చేసే అధికారి ముందుంటూ దిశానిర్దేశం చేస్తున్నారు. దీనిని అందుకున్న ఆ అధికారి ఫైలుపై ఫలానా ఏజెంటో లేక ఫలానా డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకుడి ఇన్సిల్ ఉంటే చాలు ఓకే అవుతుంది. ఈ క్రమంలో వాహనం రైట్ రైట్ అంటూ ముందుకు కదులుతుంది. ఇన్సిల్ లేకుంటే ఫైలు వెనక్కి వస్తుంది. తర్వాత వచ్చిన వినియోగదారుడి నుంచి బేరసారాలు పూర్తయ్యాక పరిశీలనకు వస్తోంది. లేకుంటే వివిధ స్థాయిల్లో కొర్రీలు, అభ్యంతరాలతో రివర్స్ అవుతుంది. ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ లైసెన్సు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్..ఇలా పని ఏదైనా పైసలు ముట్టాల్సిందే. ఏజెంట్ అయితే డీసీబీ రూపంలో, డైరెక్ట్ కస్టమర్ అయితే అప్పటికప్పుడే పైసలు ఇస్తే పనైపోతోంది. ఇదీ స్థూలంగా ఇక్కడ జరుగుతున్న సేవల ప్రక్రియ.

మదనపల్లెలోని రోడ్డు ట్రాన్స్‌పోర్టు కార్యాలయం..పట్టణానికి అయిదు కి.మీ. దూరంలోని బైపాస్ రోడ్డు ఏరియాలో ఉంటుంది. ఇక్కడికి మదనపల్లె మున్సిపాలిటీతో పాటు మదనపల్లె, నిమ్మనపల్లె మండలాలు, తంబళ్లపల్లె నియోజకవర్గంలోని తంబళ్లపల్లె, కురబలకోట, బి.కొత్తకోట, ములకలచెరువు, పీటీఎం, పెద్దమండ్యం, పీలేరు నియోజకవర్గంలోని గుర్రంకొండ, వాల్మీకిపురం మండలాల నుంచి ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ లైసెన్స్ (డీఎల్), ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ), టైటిల్ ట్రాన్స్‌ఫర్ (టీటీ), తదితర సేవల కోసం రోజువారీ వంద మందికిపైగా కస్టమర్లు వస్తుంటారు. ఈ సేవలకుగాను ప్రభుత్వం చలానా రూపంలో ధరలు నిర్ణయించగా, వాటిని వాహనదారులు ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేసి ఫైలు ఆమోదానికి నిరీక్షిస్తుంటారు. కొన్ని ఆన్‌లైన్‌లో ఆమోదం తెలిపేవి అయితే, డైరెక్ట్‌గా ఆర్టీవో కార్యాలయానికి వచ్చి చేసుకునే సేవలు మరికొన్ని ఉన్నాయి. ఇవి పూర్తి చేయించుకునే క్రమంలోనే అటు ఏజెంట్లు, డ్రైవింగ్ స్కూల్స్ నిర్వాహకులు, మరికొన్ని ఇక్కడి కార్యాలయంలోని ప్రైవేటు సిబ్బంది చేసేటివి ఇంకొన్ని ఉంటున్నాయి. ఈ పనులు చక్కబెట్టే క్రమంలోనే లోపీజులు, మామూళ్లు ఇచ్చుకోవాల్సి వస్తోంది. ఇందులో భాగంగా ఎల్ఎల్ఆర్, డీఎల్, ఎఫ్‌సీ, టీటీలకు ధరలు నిర్ణయించారు. ఇక ఎల్ఎల్ఆర్ విషయంలో అయినవారికి ఒక విధంగా, కానివారికి మరోవిధంగా వ్యవహరిస్తున్నట్లు చెబుతున్నారు. డీసీబీ ఉంటే కంప్యూటర్‌లో పరీక్ష మమ అనిపించి వేలిముద్ర వేసి ఓకే చేస్తుండగా, కొత్తవారికి అయితే కంప్యూటర్ ఇచ్చేసి అక్కడి నుంచి వెళ్లిపోతున్నారు.

మదనపల్లె పట్టణంలో 20 మంది ఆర్టీవో ఏజెంట్లు, 10 డ్రైవింగ్ స్కూల్ సెంటర్లు ఉన్నాయి. అలాగే బి.కొత్తకోట, అంగళ్లు, ములకలచెరువు, గుర్రంకొండ, వాల్మీకిపురంలోనూ ఆర్టీవో ఏజెంట్లతో పాటు డ్రైవింగ్ శిక్షణ కేంద్రాలు ఉన్నాయి. అలాగే ఆర్టీవో కార్యాలయం పరిధిలోని ప్రైవేటు స్కూల్స్ కళాశాలలకు చెందిన 300పైగా బస్సులు, ఓవర్‌లోడ్‌తో వెళ్లే లారీలు వందకుపైగా వీరి వద్ద డీసీబీ జాబితాలో ఉన్నట్లు చెబుతున్నారు. స్కూల్ బస్సులకు ఏటా మే నుంచి మరో ఏడాదిలో ఎఫ్‌సీ ఉంటుండగా, మిగిలిన వాహనాలు ఏడాదంతా చేస్తుంటారు. ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న లారీలు, టిప్పర్లు, ఐషర్లను ట్రాన్స్‌పోర్టు అధికారులు తనిఖీలలో ఆపి కేసులు నమోదు చేస్తుంటారు. ఇందులో భాగంగా ఒక్కో కేసులో టన్నేజీని బట్టి రూ.50 వేల నుంచి రూ.60 వేలు జరిమానా విధిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ క్రమంలో స్థానికంగా ఉంటున్న లారీ, మినీ లారీ, ఐషర్ వాహన యజమానులు..సంబంధిత అధికారులతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. ఇందుకుగాను ఒక్కో వాహనానికి రూ.6,600 వసూలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఎక్కడైనా తనిఖీలలో పట్టుపడితే..వారి వద్ద ఉన్న జాబితాలో ఆ వాహనం నెంబర్ ఉంటే రైట్ రైట్ చెబుతుండగా, జాబితాలోని హెవీ టన్నేజీతో వెళ్తున్న వాహనాలపై కేసులు, జరిమానాలు విధిస్తుంటారని తెలుస్తోంది. అలాగే స్కూల్, కళాశాల బస్సులకు ఎఫ్‌సీకి రూ.5,500 ధర నిర్ణయించినట్లు చెబుతున్నారు.

ఇక్కడి కార్యాలయంలో మోటార్ వెహికల్ సీనియర్ ఇన్‌స్పెక్టర్, జూనియర్ ఇన్‌స్పెక్టర్, ఓ హెడ్‌కానిస్టేబుల్, జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, నలుగురు ప్రైవేటు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. తాజాగా మరో ఇన్‌స్పెక్టర్ వారం రోజుల క్రితం ఇక్కడ విధుల్లో చేరారు. అయితే ఇందులో ఒక ఇన్‌స్పెక్టర్ ఆగడాలు ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు. వాహనాల తనిఖీతో పాటు ఎఫ్‌సీ సమయంలో వాహనదారుల పట్ల దురుసుగా ప్రవర్తించడంతో పాటు డ్రైవర్లను దుర్భాషలాడుతున్నట్లు బాధితులు వాపోతున్నారు. ఈయన ఆగడాలపై గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లగా, అప్పటి నుంచి మరో ఇన్‌స్పెక్టర్ ఎక్కువగా వాహనాలను తనిఖీ చేసే బాధ్యతను తీసుకున్నట్లు చెబుతున్నారు. ఈ విషయాల్లో క్యాడర్ ఒకరిదైతే..డామినేషన్ మరొకరిది ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.

డీసీబీ (లంచం) ధరల పట్టిక	ప్రభుత్వ చలానా	డీసీబీ
ద్విచక్ర వాహనం ఎల్ఎల్ఆర్	రూ.250	రూ.1200
నాలుగుచక్రాల వెహికల్ ఎల్ఎల్ఆర్	రూ.250	రూ.1200
హెవీ వెహికల్ ఎల్ఎల్ఆర్	రూ.210	రూ.1000
ద్విచక్ర వాహనం డీఎల్	రూ.920	రూ.1000
హెవీ లైసెన్సు	రూ.1400	రూ.2500
నాలుగు చక్రాల వాహనానికి డీఎల్	రూ.925	రూ.1000
ద్విచక్ర, నాలుగు చక్రాల.. వాహనాల రెండింటికీ	రూ.1020	రూ.1500
టాటా ఏస్ (ఎఫ్‌సీ)	రూ.720	రూ.1050
హెవీ వెహికల్ ఎఫ్‌సీ	రూ.1000	రూ.3250
కొత్తలారీ న్యూ రిజిస్ట్రేషన్	చలానా లేదు	రూ.4500
కారు ట్రాన్స్‌ఫర్	రూ.600	రూ.850
ట్రాక్టర్ ప్లస్ ట్రాలీ	రూ.1200	రూ.2200
ఇతర రాష్ట్రాల వాహనాల మార్పిడి		
ద్విచక్ర వాహనం	రూ.300	రూ.500
నాలుగు చక్రాల వాహనం	రూ.600	రూ.850
కళాశాల, స్కూల్ బస్సుల (కొత్తవి) ఎఫ్‌సీ	రూ.920	రూ.4500

ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దు..

మా కార్యాలయం సేవల కోసం వచ్చే వినియోగదారులు ఎవరికీ డబ్బులు ఇవ్వవద్దు. ఏజెంట్లను కూడా ఆశ్రయించవద్దు. డైరెక్ట్‌గా వారే వచ్చి సేవలు పొందవచ్చు. అన్నీ ఆన్‌లైన్ అయినప్పుడు ఏజెంట్లు, మధ్యవర్తులు ఎందుకు?. గతంలో కూడా ఇలాంటి ఆరోపణలు, విమర్శలు వచ్చినప్పుడు వాటిని రెక్టిపై చేసే ప్రయత్నం చేశాం. ఇక్కడికి వచ్చే వినియోగదారుల పట్ల ఓపికగా, మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచనలు ఇచ్చాను.

- పి.దినేష్‌చంద్ర, ఆర్టీవో, మదనపల్లె

కడప-బెంగళూరు రైల్వేలైన్ పనులు చేపట్టండి : తులసిరెడ్డి

రాయచోటి టౌన్, జూలై 3: రాయలసీమ సమగ్రాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం 2008-09లో మంజూరు చేసిన కడప-బెంగళూరు నూతన రైల్వేమార్గం పనులను వెంటనే చేపట్టి పూర్తి చేయాలని రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన రాయచోటిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ రైల్వే లైన్లు రాయలసీమ సమగ్రాభివృద్ధికి ఎంతో అవసరమని, 50 శాతం నిధులు కేంద్రం, 50 శాతం నిధులు రాష్ట్రం భరించే షరతులతో ఈ ప్రాజెక్టు మంజూరైందన్నారు. కడప నుంచి పెండ్లిమర్రి వరకు 21 కిలోమీటర్లు పూర్తయిందని తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వాటా నిధులు ఇవ్వని కారణంగా రైల్వేశాఖ పనులు నిలిపివేసిందన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన చంద్రబాబు ప్రభుత్వం తన వాటాగా ఇవ్వాల్సిన నిధులు వెంటనే విడుదల చేసి పనులు తిరిగి ప్రారంభం అయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని తులసిరెడ్డి కోరారు. కాంగ్రెస్ పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు షేక్ అల్లాబకష్ మాట్లాడుతూ కలిసి వచ్చే పార్టీలన్నీ కలుపుకొని భారీ ఎత్తున రైలు మార్గం కొరకు ధర్నాలు, దీక్షలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు చెన్నకృష్ణ, మహమ్మద్‌రఫీ, అజ్మతుల్లా, అమీర్, ఖదీర్, విశ్వనాధరెడ్డి, అమర్, ఉత్తన్న, సుబ్బరాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి


వైవీయూలో డిగ్రీ కోర్సులు

● ఈ విద్యాసంవత్సరం నుంచే ప్రారంభం
● వైవీయూ ప్రిన్సిపాల్ రఘునాథ రెడ్డి

కడప (మారుతీనగర్), జూలై 3: యోగివేమన విశ్వవిద్యాలయంలో ఈ విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ కోర్సులను ప్రవేశ పెడుతున్నట్లు వైవీయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) 2020ని అమలుచేయడంలో భాగంగా ఈ విద్యాసంవత్సరం నుంచి బీఎస్సీ (హానర్స్) ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్స్ కోర్సులను ప్రారంభిస్తున్నామన్నారు. బీఎస్సీ (ఆనర్స్) ఫిజిక్స్ సబ్జెక్టుతో పాటు కంప్యూటర్స్ సైన్స్, నానో-సైన్స్ కంప్యూటేషనల్ ఫిజిక్స్, డేటా సైన్స్, ఫిజిక్స్ టెక్నాలజీ విద్యార్థి ఎంపిక చేసుకుని చదివే అవకాశం ఉందన్నారు. బీఎస్సీ (ఆనర్స్) రసాయన శాస్త్రం మేజర్ సబ్జెక్టుగా తీసుకోవడంతో పాటుగా అప్లికేషన్ కెమికల్ సైన్స్, కంప్యూటేషనల్ కెమిస్ట్రీ మెటీరియల్ సైన్స్ చదువవచ్చన్నారు. బీకాం (ఆనర్స్) కంప్యూటర్ సైన్స్ ప్రధాన అంశంగా ఉందన్నారు. బిజినెస్ కామర్స్ కంప్యూటర్స్ సైన్స్ ఫైనాన్సియల్ టెక్నాలజీ ఇన్ఫర్మేషన్ సిస్టం మేనేజ్మెంట్ వంటి అంశాలతో బలమైన పునాది వేసే అవకాశం విద్యార్థికి లభిస్తుందన్నారు. నాలుగేళ్ల హానర్స్ కోర్స్ ఉత్తమ మార్కులతో పూర్తి చేస్తే నేరుగా రీసెర్చ్‌లో ప్రవేశించే అవకాశం ఉందన్నారు. ప్రపంచ అవసరాలకు తగ్గట్టు విద్యను అందించేందుకు వైవీయూ కట్టుబడి ఉందన్నారు. వినూత్న కోర్సులు, అత్యాధునిక ల్యాబ్‌లు, నిష్ణాతులైన అధ్యాపక బృందం వైవీయూలో ఉన్నాయన్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్ కూడా ఉందన్నారు. సమావేశంలో వైవీయూ దూరవిద్య సంచాలకులు ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి, డీన్ ప్రొఫెసర్ సుబ్బరాయుడు, ప్రొఫెసర్ అమృత ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ ఎస్వీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

● 14 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



వివరాలను వెల్లడిస్తున్న సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ భక్తవత్సలం

రాయచోటిటౌన్, జూలై 3: అన్నమయ్య జిల్లాతో పాటు ఇతర జిల్లాల్లో వివిధ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్నట్లు అంతర్ జిల్లాల దొంగను బుధవారం రాయచోటి అర్బన్ పోలీసులు అరెస్టు చేసి అతడి వద్ద నుంచి 14ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి బుధవారం రాయచోటి పట్టణంలోని అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ భక్తవత్సలం మీడియాతో మాట్లాడుతూ ఇటీవల రాయచోటిలో జరిగిన ద్విచక్రవాహనాల చోరీలపై ఎస్పీ కృష్ణారావు, రాయచోటి డీఎస్పీ శ్రీధర్ ఆదేశాల మేరకు రాయచోటి సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ భక్తవత్సలం పోలీస్ సిబ్బందితో కలిసి రాయచోటి పట్టణ పరిధిలోని గాలివీడు రింగు రోడ్డు వద్ద వాహన తనిఖీల్లో దొంగను పట్టుకున్నారు. పెద్దమండెం మండలం ము సలికుంట గ్రామం గోనుపోతులారిపల్లె తండాకు చెందిన వెంకట్రమణనాయక్ కుమారుడు బుక్కే అశోక్‌నాయక్ అలియాస్ కుమార్ నాయక్‌ను పట్టుకొని విచారించగా అతను రాయచోటిటౌన్‌తో పాటు మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, తిరుపతి తదితర ప్రాంతాల్లో 14 మోటారు సైకిళ్లను దొంగిలించినట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. అతడి వద్ద నుంచి 14ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలియజేశారు. నిందితుడిపై గతంలో మదనపల్లి, పుంగనూరు, గాలివీడు, ముదివేడు పోలీస్‌స్టేషన్‌లో 21 మోటారు సైకిల్ దొంగతనం కేసులు నమోదయ్యాయని, ఆ కేసుల్లో అతనికి గతంలో కోర్టు జైలు శిక్ష కూడా విధించిందని ఆయన వివరించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పెట్టినట్లు ఆయన తెలిపారు.



రాయచోటి అర్బన్ పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

ప్రైవేట్ రయ్..రయ్.. ఆర్టీసీ నై..నై..

● గుర్రంకొండ-వాల్మీకిపురం మార్గంలో కానరాని ఆర్టీసీ
● కలెక్షన్ లేదనే సాకుతో ఆర్టీసీ బస్సులు నిలుపుదల
● వైసీపీ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లకే..
● విద్యార్థులు, ఉద్యోగులకు తప్పని తిప్పలు
● రవాణా శాఖ మంత్రి జిల్లాలో వింత పరిస్థితి

గుర్రంకొండ, జూలై 3: ఒకప్పుడు గుర్రంకొండ నుంచి వాల్మీకిపురానికి వెళ్లాలంటే సింగిల్ రోడ్డు అది కూడా అతుకులు గతుకులతో ఉండేది. అలాంటి పరిస్థితుల్లోనే ఆ మార్గంలో ఆర్టీసీ బస్సులు నడిచేవి. దీంతో ఆ మార్గంలోని గ్రామాల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉండేది. ప్రస్తుతం సింగిల్ రోడ్డు పోయి డబుల్ రోడ్డు వచ్చినా ఆర్టీసీ బస్సులు మాత్రం తిరగడం లేదు. ఇక్కడి ప్రజలు ప్రైవేట్ బస్సులు, ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. అవి కూడా సరైన సమయానికి లేకపోవడంతో విద్యార్థులతో పాటు ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన రెండేళ్ల తర్వాత ఈ మార్గంలో ఆర్టీసీ బస్సులను ఆపివేశారు. ప్రైవేట్ బస్సుల యజమానులకు లబ్ధి చేకూర్చడానికి అప్పటి ప్రజాప్రతినిధులు బస్సులను ఆపివేసినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. బస్సుల ప్రయాణం ప్రారంభమైన నాటి నుంచి గుర్రంకొండ-వాల్మీకిపురానికి ఆర్టీసీ బస్సులు నడిచేవి. మారుమూల ప్రాంతాలను కలుపుతూ ఉన్న ఎగుడు దిగుడు రోడ్లపై నాడు బస్సులను ప్రభుత్వం నడిపేది. ఈ క్రమంలో బస్సులపై ఆధారపడి నాటి గ్రామీణ, పట్టణ ప్రజలు ప్రయాణాలు చేసేవారు. కాలక్రమేణా బస్సు ప్రయాణం ప్రజలకు సౌకర్యవంతంగా మారింది. ఈ క్రమంలో సింగిల్ రోడ్డు ఉన్న సమయంలో నడిచిన ఆర్టీసీ బస్సులు డబుల్ రోడ్డుగా మారిన తరువాత నడవకపోవడం వింతగా మారింది. కొన్నేళ్లుగా ఈ మార్గంలో ఆర్టీసీ బస్సులు లేక విద్యార్థులు, ప్రజలు, ప్రయాణీకులు పడరానిపాట్లు పడుతున్నారు. దీంతో ప్రైవేట్ బస్సులు వచ్చినపుడే బస్సులు ఎక్కుతూ ప్రయాణాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడానికి కూడా ఆర్టీసీ బస్సులు లేక ఆటోలు, ప్రైవేట్ బస్సులపై ఆధారపడ్డారు. రవాణా శాఖాధికారులు మాత్రం కలెక్షన్ లేకపోవడం, బస్సుల కొరతతో సర్వీసులను నిలిపివేశామని చెబుతున్నారు. రవాణా శాఖ మంత్రి జిల్లాలో వింత పరిస్థితి నెలకొంది.

మండల కేంద్రమైన గుర్రంకొండకు అనుసంధానంగా పలు రోడ్డు మార్గాలు ఉన్నాయి. ఇందులో భాగంగా గుర్రంకొండ-మదనపల్లె, గుర్రంకొండ-కలకడ, గుర్రంకొండ-వాల్మీకిపురం, గుర్రంకొండ-గాలివీడు, గుర్రంకొండ-రాయచోటి మార్గాలను కలుపుతూ డబుల్ రోడ్డు మార్గాలున్నాయి. ఈ ప్రధాన రహదారులే కాక వీటిని కలుపుతూ గ్రామీణ ప్రాంతాలకు కూడా తారురోడ్లు ఉన్నాయి. దాదాపుగా చాలా రోడ్డు మార్గాల గుండా ప్రభుత్వం ఆర్టీసీ బస్సులను నడుపుతుంది. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాలకు కూడా ఉదయం, సాయంత్రం పూట ఆర్టీసీ బస్సులు నడిచేలా చూస్తున్నారు. అలాంటిది అన్నమయ్య జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉండే గుర్రంకొండ నుంచి వాల్మీకిపురానికి కొన్నేళ్లుగా ఆర్టీసీ బస్సులు నడవకపోవడం గమనార్హం. జిల్లా కేంద్రమైన రాయచోటికి వెళ్లడానికి గుర్రంకొండ నుంచి 40 కిలోమీటర్ల దూరం చేరడానికి 0.45 నిమిషాల ప్రయాణ సమయం పడుతుంది. కానీ గుర్రంకొండ నుంచి 20 కిలోమీటర్ల దూరం ఉన్న వాల్మీకిపురానికి చేరడానికి ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రయాణీకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ మార్గంలో నడిచే ప్రైవేట్ బస్సులపై ఆధారపడి గంటల తరబడి బస్సుల కోసం వేచి చూడాల్సిన దయనీయస్థితి ప్రయాణీకులది. ఈ నేపథ్యంలో ప్రయాణీకులు, విద్యార్థులు ప్రైవేట్ బస్సులపై ఆధారపడి ప్రయాణాలను సాగిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన రెండేళ్ల తర్వాత ఈ మార్గంలో ఆర్టీసీ బస్సులను కలెక్షన్లు లేవని, బస్సుల కొరత ఉందని నిలిపివేశారు. ప్రైవేట్ బస్సులు మాత్రం ఫుల్ కలెక్షన్‌తో తిరుగుతున్నాయి. అప్పటి పాలకుల స్వార్థంతోనే బస్సులను ఆర్టీసీ బస్సులను ఆపివేశారని ఇక్కడి ప్రజలు చర్చించుకుంటున్నారు.



గుర్రంకొండ బస్టాండులో నిలిపిన ప్రైవేట్ బస్సు

మహిళలకు ఉచిత బస్సు కలేనా?

రాష్ట్రం ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో అమలు చేయనున్న ఉచిత బస్సు ప్రయాణం ఈ మార్గంలో మహిళలకు అందని ద్రాక్షలా మారనుంది. గుర్రంకొండ నుంచి వాల్మీకిపురానికి 20 కిలోమీటర్ల దూరం డబుల్ రోడ్డు ఉంది. ఈ మార్గానికి అనుసంధానంగా పదుల సంఖ్యలో గ్రామీణ రోడ్లు ఉన్నాయి. ఈ మార్గాల గుండా పదుల సంఖ్యలో గ్రామాలున్నాయి. ఈ మార్గాల నుంచి నిత్యం విద్యార్థులు, ప్రజలు, మహిళలు, ఉద్యోగులు వందల సంఖ్యలో ప్రయాణాలు చేస్తున్నారు. ఈ రోడ్డు మార్గంలో ఆర్టీసీ బస్సులు లేవు. దీంతో గుర్రంకొండ నుంచి తరిగొండ మీదుగా వాల్మీకిపురానికి వెళ్లే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం దొరికేనానని ప్రజలు, మహిళలు చర్చించుకుంటున్నారు. రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టి సారించి ఈ మార్గంలో ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఈ ప్రాంత మహిళలు కోరుతున్నారు.

విద్యార్థులకు తప్పని తిప్పలు

గుర్రంకొండ-వాల్మీకిపురం మార్గంలో పాఠశాలలు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు ఆర్టీసీ బస్సులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం బాలికలకు ఉచిత బస్సు పాసులను ఏటా ఇచ్చినా ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ఆటోలు, ద్విచక్ర వాహనాలపై పాఠశాలలకు వెళుతున్నారు. కొన్ని సమయాల్లో ఆటోలు ప్రమాదాలకు గురి కావడంతో విద్యార్థులు అంగవైకల్యం బారినపడుతున్నారు. అంతేకాకుండా బస్సులు లేకపోవడంతో మైనర్ విద్యార్థులు ద్విచక్ర వాహనాల్లో పాఠశాలలు, కళాశాలలకు వెళుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో తల్లిదండ్రులు పిల్లలను చదివించడానికి నానాతంటాలు పడుతున్నారు.

మంత్రి ఇలాకాలో వింత పరిస్థితి..

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడడం... అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి నుంచి గెలిచిన ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రాష్ట్ర రవాణా శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. వాల్మీకిపురం నుంచి జిల్లా కేంద్రమైన రాయచోటికి వెళ్లాలంటే గుర్రంకొండకు ఆర్టీసీ బస్సులు లేవు. దీంతో జిల్లా కేంద్రానికి చేరుకోవడానికి ప్రజలు, ప్రయాణీకులు అష్టకష్టాలు పడుతున్నారు. మంత్రి ఈ ప్రాంతంపై దృష్టి సారించి ఆర్టీసీ బస్సులను ఈ మార్గంలో ఏర్పాటు చేసి మహిళలకు, విద్యార్థులకు, ఉద్యోగులకు మేలు చేస్తారని కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో గుర్రంకొండ మండల ప్రజలు తమకున్న పెద్ద సమస్యైన బస్సు సమస్య తీరుతుందని భావిస్తున్నారు.

కలెక్షన్ లేకపోవడం, బస్సుల కొరతతో నిలిపేశాం..

గుర్రంకొండ-వాల్మీకిపురం రోడ్డు మార్గంలో ఆర్టీసీ బస్సులు గతంలో నడిచేవి. ఈ మార్గంలో ప్రైవేట్ బస్సులు, ఆటోలు అధికంగా తిరుగుతున్నాయి. దీంతో ఆర్టీసీ బస్సులకు కలెక్షన్ తక్కువగా వస్తుండటంతో నష్టాలతో ఆర్టీసీ బస్సులను తిప్పలేక నడిచే సర్వీసులను ఆపేశాం. అంతేకాకుండా డిపోలో బస్సుల కొరత ఉన్న కారణంగా కూడా గుర్రంకొండ-వాల్మీకిపురం, వాల్మీకిపురం-నిమ్మనపల్లె రోడ్డు మార్గాల్లో ఆర్టీసీ బస్సులను నడపడం లేదు.

- వెంకటరమణారెడ్డి, మదనపల్లె ఆర్టీసీ డిపో-1 మేనేజర్

'అమూల్'లో డిప్యుటేషన్లు రద్దు

- పర్యవేక్షణ బాధ్యతల నుంచి సహకార సిబ్బంది రిలీవ్
- మరికొన్ని రోజుల్లో మిగిలిన శాఖల్లో..

కడప (ఎన్జీఆర్ సర్కిల్), జూలై 3: మహిళా (అమూల్) పాల డెయిరీ కార్యకలాపాల నుంచి ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది డిప్యుటేషన్లను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అమూల్ పాల ఉత్పత్తి సంస్థతో గత ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుని మహిళా సంఘాల పేరుతో పాల సేకరణకు శ్రీకారం చుట్టారు. జగనన్న పాల వెల్లువ పేరుతో డెయిరీ కార్యకలాపాలు నిర్వహిస్తూ వచ్చారు. ఈ క్రమంలో ప్రభుత్వంలో అదొక భాగంగా పరిగణిస్తూ అమూల్ సిబ్బందిని కాదని ప్రభుత్వశాఖల అధికారులు, సిబ్బందిని జగనన్న పాల వెల్లువలో బాధ్యతలు అప్పగించారు. అంతేకాకుండా పాల సేకరణకు అవసరమైన సామగ్రిని దాదాపు ఒక్కో గ్రామానికి మూడులక్షల రూపాయలు విలువ చేసే పరికరాలను ప్రభుత్వ నిధుల నుంచి వినియోగించినట్లు తెలుస్తుంది. అంతేకాకుండా పలుచోట్ల పాల కేంద్రాల నిర్మాణానికి ప్రభుత్వ స్థలాలను కేటాయించడంతో పాటు ప్రజాధనంతోనే నిర్మాణాలు కూడా చేపడుతున్నట్లు సమాచారం. సహకారశాఖలో ఎక్కువ సంఖ్యలో అధికారులను డెయిరీ కార్యకలాపాలకు వినియోగించడం వల్ల వారి సొంత శాఖల పనులకు ఇబ్బందులు ఏర్పడినట్లు తెలుస్తుంది. చాలా సహకారసంఘాల్లో ఆడిట్ల నిర్వహణ ఆలస్యం కావడంతో అక్రమాలకు కూడా ఆస్కారం ఏర్పడినట్లు చర్చ సాగుతోంది.

సహకార సిబ్బంది డిప్యుటేషన్లు రద్దు

ఇప్పటి వరకు జిల్లాలో డెయిరీ కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు సహకార సిబ్బందిని నియమించారు. డిప్యుటేషన్లు రద్దు చేసి ఈ మేరకు జిల్లా కలెక్టర్ల నుంచి నోటిఫికేషన్ పొందాలని జిల్లా సహకార శాఖ అధికారులను ఆ శాఖ కమిషనర్, సహకార సంఘాల రిజిస్ట్రార్ ఎ.బాబు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో పులివెందుల, లింగాల, చక్రాయపేట తదితర ప్రాంతాల్లో డెయిరీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. వీటికి అనుగుణంగా ఆయా బల్క్‌మిల్క్ యూనిట్లకు అనుబంధంగా ఉన్న గ్రామాల్లో పాల సేకరణ చేపట్టడం జరుగుతుంది.



ప్రస్తుతం రోజుకు 20 వేల లీటర్ల పాల సేకరణ జరుగుతున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఈ డెయిరీ కార్యకలాపాలను జగన్ ప్రభుత్వం సహకారశాఖతో పాటు పశు సంవర్ధకశాఖ, డీఆర్‌డీఏ సిబ్బందితో నిర్వహించేందుకు ఆదేశాలు ఇచ్చి ఉన్నారు. ప్రభుత్వం మారిన తరుణంలో పలు మార్పులు తీసుకువచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ప్రభుత్వం అధికారులు, సిబ్బంది డిప్యుటేషన్లను రద్దు చేసేందుకు చర్యలు తీసుకుంది. ప్రస్తుతం సహకారశాఖ అధికారులు, సిబ్బందిని మాత్రమే డెయిరీ విధుల నుంచి తప్పించారు. మరికొన్ని రోజుల్లో మిగిలిన శాఖలకు సంబంధించి వారిని కూడా తమ శాఖలకు పంపనున్నట్లు తెలుస్తోంది.

సహకార సిబ్బంది రిలీవ్

ఏపీ మహిళా డెయిరీలో చట్టబద్ధంగా పనిచేస్తున్న వారిని మినహాయించి మిగిలిన వారికి సంబంధించిన డిప్యుటేషన్లను రద్దు చేస్తూ జిల్లా సహకారశాఖ అధికారి సుభాషిణి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో ప్రొద్దుటూరు సబ్ డివిజన్ కో ఆపరేటివ్ ఆఫీసు నుంచి సీనియర్ ఇన్‌స్పెక్టరు కె.మురళీమోహన్ పర్సన్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నందున వీరిని ఉన్నతాధికారుల నుంచి తదుపరి ఆదేశాలు అందేంత వరకు కొనసాగించనున్నట్లు తెలుస్తోంది. ఇక డిప్యుటేషన్ పద్ధతిలో పనిచేస్తున్న కమాండ్‌కంట్రోల్ ఇన్‌చార్జ్ కమాల్‌తో పాటు రూట్ ఆఫీసర్లుగా విధులు నిర్వహిస్తున్న సహకారశాఖ అధికారులు సివీ సుబ్బయ్య, ఫయాజుద్దీన్, రామక్రిష్ణ, రాజశేఖర్, ఆర్.చెన్న క్రిష్టారెడ్డి, సుభాష్‌చంద్రబోస్, ఎంవీ ప్రభాకర్‌రావు, శ్రీనివాసులు రెడ్డి, బీవీ సుబ్రమణ్యం, మహ్మద్, మురళీమోహన్, ఎం.బ్రహ్మానందరెడ్డి, రఘురామయ్య, బీపీ సుగుణల డిప్యుటేషన్లు రద్దు చేస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. ఇక నుంచి డెయిరీ సిబ్బంది పర్యవేక్షణలోనే డెయిరీ నిర్వహణ జరగనున్నట్లు తెలుస్తుంది.

రైలుకింద పడి ఏఎస్ఐ ఆత్మహత్య



వల్లూరు, జూలై 3: మండల పరిధిలోని తప్పెట్ల రైల్వేబ్రిడ్జి వద్ద ఏఎస్ఐ బసిరెడ్డి నాగార్జునరెడ్డి (58) రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. రైల్వే ఎస్ఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. కమలాపురం పోలీసు స్టేషన్‌లో నాగార్జునరెడ్డి ఏఎస్ఐగా విధులు నిర్వహించేవారు. మంగళవారం తెల్లవారుజామున 3గంటలకు విధులు ముగించుకుని కడపకు తన ద్విచక్ర వాహనంలో ఇంటికి బయలుదేరాడు. మార్గ మధ్యలోని తప్పెట్ల వద్ద తన ద్విచక్ర వాహనాన్ని పక్కన బెట్టి రైల్వేబ్రిడ్జి కిందకు వెళ్లి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఆత్మహత్యకు అనారోగ్య కారణాలు ఉండవచ్చని తెలిపారు. నాగార్జునరెడ్డి స్వగ్రామం దేవునికడప మోడమీదపల్లె అని తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి, ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



మల్లికార్జునరెడ్డి (ఫైల్)

పెండ్లిమర్రి, జూలై 3: మండలంలోని పాత సంగటిపల్లె గ్రామానికి చెందిన బాలయ్యగారి మల్లికార్జునరెడ్డి (34) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. పాతసంగటిపల్లెకు చెందిన గంగమ్మ, వెంకటసుబ్బారెడ్డి కుమారుడు మల్లికార్జునరెడ్డి. ఇతను తన తల్లి, తమ్ముడు ముగ్గురు కలసి వెల్లటూరు పెట్రోల్ బంకు పక్కన హోటల్ నిర్వహిస్తున్నారు. ఇతనికి చుట్టుపక్కల ప్రాంతాల్లో మంచి సౌమ్యుడిగా పేరుంది. ఈ నేపథ్యంలో మూడు రోజుల కిందట మల్లికార్జునరెడ్డి ఇంటి వద్దనుంచి మోటార్ సైకిల్‌పై వెళ్లి తిరిగిరాలేదు. అతని ఆచూకీ కోసం వెతుకుతుండగా వెయ్యినూతులకోన అటవీప్రాంతంలో ఉరివేసుకుని విగత జీవుడై కనిపించాడని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. కాగా, మల్లికార్జునరెడ్డి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి జైలుశిక్ష

ఓబులవారిపల్లె, జూలై 3: మండల పరిధిలోని ముదినేపల్లె దళితవాడ గ్రామానికి చెందిన కొప్పల నరసింహులుపై 2004లో జరిగిన హత్యాయత్నం కేసులో ఇద్దరు వ్యక్తులకు జైలుశిక్ష ఖరారైనట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. వివరాల్లోకి వెళితే... ముదినేపల్లె దళితవాడకు చెందిన కొప్పల నరసింహులుపై 2004లో హత్యాయత్నానికి ప్రయత్నించినట్లు ఐదుగురిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు అయ్యింది. అందుకు సంబంధించి విచారణ చేసి ముద్దాయిలను రిమాండ్‌కు పంపారు. 2006లో కేసుకు సంబంధించి ఎ-4, ఎ-5 ముద్దాయిలుగా ఉన్న కొప్పల రమణ, కొప్పల అంకయ్యలకు రాజంపేట కోర్టులో మూడేళ్ల జైలుశిక్ష విధించగా వారు హైకోర్టుకు వెళ్లారు. అయితే హైకోర్టు కూడా కింద కోర్టు వేసిన శిక్షనే ఖరారు చేయడం జరిగింది. సదరు వ్యక్తులను తిరిగి రాజంపేట కోర్టులో హాజరుపరచగా జడ్జి 4 సంవత్సరాలు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. కోర్టు కానిస్టేబుల్ మల్లికార్జున, హెడ్‌కానిస్టేబుల్ ఖాదర్‌వల్లి, కానిస్టేబుల్ కార్తీక్‌లు కోర్టు ఉత్తర్వులు అమలు చేసినట్లు తెలిపారు.

ఒకరిపై హత్యాయత్నం కేసు

వేంపల్లె, జూలై 3: వేంపల్లె ప్రియాతోటకు చెందిన స్వామినాథన్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సీఐ చాంద్‌బాషా తెలిపారు. మంగళవారం రాత్రి వివాహేతర సంబంధం వ్యవహారంలో మస్తాన్‌పై స్వామినాథన్ కత్తితో దాడి చేశారు. మస్తాన్ గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మస్తాన్ ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

మాజీ రిజిస్ట్రారుపై చర్యలు తీసుకోవాలి



ఆందోళన చేస్తున్న పీడీఎస్‌యు నాయకులు

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 3: డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీలో అవుట్ సోర్సింగ్ నియామకాలలో అక్రమాలకు పాల్పడిన మాజీ రిజిస్ట్రారు వీసీ సురేంద్రనాదరెడ్డిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. బుధవారం వైవీయూ మెయిన్‌గేటు ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందో ళన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వంలో పనిచేస్తున్న మాజీ వైస్‌చాన్సలర్ చింతా సుధాకర్, రిజిస్ట్రార్ వైపీ వెంకటసుబ్బయ్య, ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ మాజీ రిజిస్ట్రారు వీసీ సురేంద్రనాధరెడ్డిని కలిసి అవుట్ సోర్సింగ్ నియమాకాల్లో ఎటువంటి నోటిఫికేషన్, రోస్టర్ పద్ధతి లేకుండా 130 నాన్‌టీచింగ్ పోస్టులు నియమించి నిరుద్యోగులకు అన్యాయం చేశారని మండిపడ్డారు. దీనిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యు నాయకులు త్రినాదయాదవ్, విఘ్నేష్ రమణపాల్గొన్నారు.

ఎన్‌సీసీ బెటాలియన్ తరలించే ప్రయత్నాలు మానుకోండి

- ఎన్‌సీసీ సీనియర్ అండర్ ఆఫీసర్ అశోక్



ధర్నాలో మాట్లాడుతున్న ఎన్‌సీసీ సీనియర్ అండర్ ఆఫీసర్ అశోక్

కడప (మారుతీనగర్) జూలై 3: కడపలోని ఎన్‌సీసీ బెటాలియన్‌ను ఉన్నఫలంగా తిరుపతికి తరలించాలనే ప్రయత్నాలను తక్షణమే సంబంధిత ఉన్నతాధికారులు విరమించుకోవాలని ఎన్‌సీసీ సీనియర్ అండర్ ఆఫీసర్ అశోక్ స్పష్టం చేశారు. ఇందుకు నిరసనగా పలువురు డిగ్రీ కళాశాలల, పాఠశాలల ఎన్‌సీసీ విద్యార్థినీ, విద్యార్థులు బుధవారం కడప రైల్వేస్టేషన్ సమీప 30(ఎ) బీఎన్ ఎన్‌సీసీ కడప కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా అశోక్ మాట్లాడుతూ మాతృ దేశ సేవలో తరించాలనే లక్ష్యంతో ఎన్‌సీసీలో పలువురు విద్యార్థులు చేరి స్వచ్ఛం దంగా వివిధ సేవలందిస్తున్న సంగతి తెలిసిందే అన్నారు. గత కొన్నేళ్లుగా కడప నగర సమీపంలోని మామిళ్లపల్లె తెలుగుగంగ క్వార్టర్స్ సమీపంలో ఉన్న ఎన్‌సీసీ బెటాలియన్‌ను తిరుపతికి తరలించాలనుకోవడం సరైందికాదన్నారు. దీంతో ఈ ప్రాంత విద్యార్థులకు తీవ్ర అసౌకర్యంగా మారుతుందన్నారు. తిరుపతి గ్రూప్‌లోని అన్ని బెటాలియన్‌లలో ఏ,బీ,సీ సర్టిఫికెట్ల రిజల్ట్స్ వదిలినప్పటికీ.. కడప బెటాలి యన్‌లో రిజల్ట్స్‌ను తొక్కిపెట్టడం దారుణమన్నారు. ముఖ్యంగా 2023-24 సంబంధించి ఎన్‌రోల్‌మెంట్‌ను త్వరితగతిన కొనసాగించాలని డిమాండ్ చేశారు. కాదు, కూడదని తిరుపతికి తరలించాలని మొండికేస్తే జిల్లా వ్యాప్తంగా వివిధ కళాశాలలు, పాఠశాలల్లో గల ఎన్‌సీసీ విద్యార్థులను ఏకం చేసి పోరు సాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ డిగ్రీ కళాశా లల, విద్యార్థుల ఎన్‌సీసీ కేడెట్లు, ఎన్‌సీసీ క్యాడెట్ సోలోమెన్ మునివర్ధన్, కాశి, శివారాణి, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

కొత్త నేర చట్టాలపై సమీక్ష జరగాలి



ఇన్‌చార్జి కలెక్టర్‌తో మాట్లాడుతున్న న్యాయవాదులు

రాయచోటిటౌన్, జూలై 3: పార్లమెంట్‌లో ఎలాంటి చర్చ జరపకుండానే కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన కొత్త నేర చట్టాలపై తిరిగి సమీక్ష జరపాలని... అంతవరకు చట్టాల అమలు చేయడం ఆపివేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాయచోటి బార్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి పి.రెడ్డెయ్య, భారత న్యాయవాదుల సంఘం కడప ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్, సహాయ కార్యదర్శి డి.నాగముని నేతృత్వంలో కలెక్టరేట్ ఎదుట బుధవారం నిరసన తెలియజేశారు. అంతకుముందు రాయచోటిలోని కోర్టు విధులను వారు బహిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధితులు తమకు అన్యాయం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేసిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి బాధ్యులను అదుపులోకి తీసుకొని కేసును విచారణ జరపాలన్నారు. కొత్తగా వచ్చిన చట్టం ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండానే జరిగిన సంఘటనపై పోలీసులు ప్రాథమిక విచారణ చేసిన తర్వాత ఎఫ్ఐఆర్ చేయవచ్చునని నిబంధన పెట్టడం బాధితులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. దీంతో పోలీసులకు అపరిమిత అధికారాలు వచ్చి ఇష్టం వచ్చినట్లు చేసే అవకాశం ఉందన్నారు. రిమాండ్‌కు తరలించిన తర్వాత 15 రోజుల్లోగా ముద్దాయిలను పోలీసులు కస్టడీలోకి తీసుకునే అవకాశం ఇప్పటి వరకు ఉండగా నూతన చట్టాలతో 90 రోజుల వరకు పోలీసులు కస్టడీలోకి తీసుకొనే అధికారం పోలీసులకు ఇవ్వడం దారుణమన్నారు. ఈ నిబంధనతో చాలా కాలం వరకు ముద్దాయిలు జైల్లో మగ్గాల్సి వస్తుందన్నారు. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను గానీ భారత రాజ్యాంగాన్ని గానీ ఏ మాత్రం పట్టించుకోకుండా.. ఎవరితోనూ చర్చించకుండా తీసుకొచ్చిన కొత్త నేర చట్టాలపై సమీక్ష జరిగేంతవరకు ప్రజలందరూ ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో న్యాయవాదులు ధనుంజయ్‌కుమార్, చిన్నయ్య, ఆనంద్‌కుమార్, హుమయూన్‌బాషా, రవిశంకర్, ఖాదర్‌బాషా, నిరంజన్, ఖిజరలి, ఉత్తేజ్‌కుమార్, చంద్రశేఖర్, నాగాంజనేయులు పాల్గొన్నారు.

నా భూమిని దౌర్జన్యంగా ఆక్రమించారు

- ఎస్పీకి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం



పోలీసులు, పెద్దల సమక్షంలో భూమిని కొలుస్తున్న సర్వేయర్

చక్రాయపేట, జూలై 3: నా భూమిని కొంతమంది దౌర్జన్యగా ఆక్రమించుకున్నారని కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశాను. వారు కింది స్థాయి అధికారులకు ఆదేశించినా పట్టించుకోవడం లేదని ఆనందరెడ్డి అనే రైతు విలపించాడు. వివరాల్లోకెళితే... గడ్డంవారిపల్లె గ్రామం గొందిపల్లె సమీపంలో కనం వద్ద 985 సర్వే నెంబర్‌లో సరస్వతికి 1.80 ఎకరాలు, ఆనందరెడ్డికి ఒక ఎకరా భూమి ఉంది. ఆ భూమిని వనంలోపల్లెకు చెందిన వారు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని ఆరు నెలల క్రితం అప్పటి తహసీల్దార్ రాజసింహనరేంద్రకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సర్వేయర్‌ను పిలిపించి భూమి ఆనందరెడ్డిదే అని చెప్పి రాళ్లు నాటించాడు. అనంతరం ఈ రాళ్లను దౌర్జన్యంగా తీసేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ మళ్లీ సర్వే చేయించి న్యాయం చేస్తామని చెప్పి.. సర్వే చేయించి రాళ్లు నాటించాడు. అయితే మళ్లీ రాళ్లు పీకేశారు. ఈ విషయం ఎస్ఐకి చెప్పినా పట్టించు కోలేదు. దీంతో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో.. తహసీల్దార్, ఎస్ఐలను న్యాయం చేయాలని ఆదేశించారు. కానీ ఎస్ఐ మళ్లీ బుధవారం సర్వే చేయిస్తుండగా ప్రత్యర్థులు దౌర్జన్యంగా భూమిని కొలవకుండా అడ్డుకున్నారు. పోలీసుల సమక్షంలోనే జరుగుతున్నా పట్టించుకోలేదు. నేను టీడీపీ కార్యకర్తను అని.. నన్ను చాలా ఇబ్బందులు పెట్టారని.. ప్రస్తుతం ప్రభుత్వం మారింది.. ఇప్పటికైనా న్యాయం చేయాలని బాధిత రైతు ఆనందరెడ్డి కోరుతున్నారు. లేదంటే ఆత్మహత్యే శరణ్యమని విలపించాడు. ఈ విషయంపై ఎస్ఐని వివరణ కోరగా.. సర్వేయర్ రిపోర్టు ఇస్తే చర్యలు తీసుకుంటానని ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు.

ప్రత్యేక కేటగిరిలో మూడో రోజు సర్టిఫికెట్ వెరిఫికేషన్



దివ్యాంగులకు సంబంధించి సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

నూజివీడు టౌన్, జూలై 3: రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ప్రత్యేక కేటగిరి విద్యార్థులకు మూడో రోజు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏలూరు జిల్లా నూజివీడు ఆర్జీయూకేటీ అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్.అమరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సైనిక సంతతి విభాగానికి చెందిన 57 మంది, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో 49, ఎన్‌సీసీ విభాగంలో 101 మంది, క్రీడా విభాగంలో 180, దివ్యాంగుల విభాగంలో 248 మంది మొత్తం 579 విద్యార్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు యాప్ ద్వారా చెల్లించాలి

కడప (నాగరాజుపేట), జూలై 3: విద్యుత్ బిల్లులు ఏపీఎస్పీడీసీఎల్ యాప్ ద్వారా చెల్లించాలని జిల్లా విద్యుత్‌శాఖ అధికారి సూపరింటెండెంట్ ఇంజనీరు ఎస్.రమణ బుధవారం పేర్కొన్నారు. ఆర్‌బీఐ మార్గదర్శకాల మేరకు ఇక మీదట ఫోన్‌పే, జీపే, పేటీం, ఇతర యుపీఐ యాప్స్‌లో విద్యుత్ బిల్లులు చెల్లింపులో డిస్కం పేరు కనిపించదన్నారు. కనుక ఏపీఎస్పీడీసీఎల్ కన్స్యూమర్ యాప్‌ని గూగుల్ ప్లే స్టోరు నుంచి డౌన్‌లోడ్ చేసుకుని, లేదా మా డిస్కం వెబ్‌సైట్ http://www.apspdcl.in నుంచి కానీ బిల్లులు చెల్లించాలని సూచించారు. ఏపీఎస్పీడీసీఎల్ యాప్, లేదా డిస్కం వెబ్‌సైట్‌లో మీరు బిల్లులు చెల్లించేటప్పుడు మీరు మీ ఫోన్‌పే, జీపే, పేటీఎం లేదా ఇతర యూపీఐ యాప్స్‌ని వాడవచ్చు. మీరు డెబిట్, క్రెడిట్, నెట్‌బ్యాంకింగ్, వాలెట్, క్యాష్‌కార్డ్స్ కూడా వాడవచ్చని ఆయన తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

కడప (మారుతీనగర్), జూలై 3: ఏపీ వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆదేశాల మేరకు డీఎస్సీ (సెకండ్ గ్రేడ్ టీచర్స్) పరీక్షలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను 10వ తేదీ లోపు స్వీకరిస్తున్నట్లు వెనుకబడిన తరగతుల అధ్యాయన కేంద్రం (ఏపీ బీసీ స్టడీ సర్కిల్) కడప ఉమ్మడి జిల్లా సంచాలకులు డాక్టర్ వి.బ్రహ్మయ్య తెలిపారు. జిల్లాకు చెందిన నిరుద్యోగ బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు వారి కుటుంబ వార్షిక ఆదాయం రూ.లక్ష లోపు ఉండి టీటీసీ, టెట్ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా (బీసీ 66శాతం, ఎస్సీ 20శాతం, ఎస్టీ 14శాతం) ఎంపిక చేస్తామన్నారు. మొత్తం 200 మంది అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. శిక్షణ కాలం 60 రోజులుగా నిర్ధారించారన్నారు. ఎంపికైన వారికి స్టడీ మెటీరియల్, స్టైఫండ్ ఇస్తారన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటా, ఎస్ఎస్‌సి, ఇంటర్, టీటీసీ మార్కుల జాబితాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డ్, బ్యాంకు అకౌంట్ పాస్‌బుక్ జిరాక్స్‌లు, రెండు పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు జతపరచి పాత కలెక్టరేట్‌లోని ఏపీ బీసీ స్టడీ సర్కిల్‌లో ఈనెల 10వ తేదీ లోపు అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 9849919221, 9703185382 అనే నెంబర్లను సంప్రదించాలన్నారు.

ప్రారంభమైన వైవీయూ సర్టిఫికెట్‌కోర్సుల పరీక్షలు



పరీక్షలను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ రఘునాథరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 3: వైవీయూ లలిత కళల విభాగం నిర్వహిస్తున్న నృత్యం, కీబోర్డు, కర్ణాటక సంగీతంలో సర్టిఫికెట్ కోర్సులకు వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు అందరికీ అందుబాటులో ఉండేలా శ్రీహరి డిగ్రీ కాలేజీలో నిర్వహిస్తున్నారు. సుమారు వంద మంది పరీక్షలకు హాజరయ్యారు. ఈ విభాగం అధిపతి డాక్టర్ కె.మృత్యుంజయరావు పర్యవేక్షణలో పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్ష కేంద్రాన్ని రిజిస్ట్రార్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ ఏదోక కళను అభ్యసించాలని తద్వారా అది మనిషిని సంస్కరిస్తుందన్నారు. కార్యక్రమంలో శ్రీహరి డిగ్రీకాలేజీ కరస్పాండెంట్ సుబ్బారెడ్డి, వైవీయూ పీఆర్‌వో ఎస్వీ సుబ్బారెడ్డి, అధ్యాపకులు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

పోటాపోటీగా వేంపల్లె మార్కెట్ వేలం


- పంచాయతీకి రూ.40.30 లక్షలు ఆదాయం

వేంపల్లె, జూన్ 3: వేంపల్లె మేజర్ పంచాయతీ పరిధిలోని మార్కెట్‌లో వ్యాపార సముదాయంలో పన్ను వసూలు చేసుకునే హక్కు కోసం వేలం పోటాపోటీగా జరిగింది. స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం డీఎల్పీఓ రమాదేవి, సర్పంచు ఆర్.శ్రీనివాసులు, ఈఓ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. గత సంవత్సరం 12నెలలకు రూ.33లక్షలు వేలం పాడగా ఈ ఏడాది తొమ్మిది నెలల కాలానికి రూ.40.30లక్షలతో కుప్పాలపల్లె రామగంగిరెడ్డి దక్కించుకున్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ హరికృష్ణ, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పదంగా మారిన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ

- మొదటి భార్య సంతానం ఉన్నా... లేనట్లుగా ధ్రువీకరణ
- నందిమండలం గ్రామ రెవెన్యూ అధికారి తీరిది

పెండ్లిమర్రి, జూలై 3: నందిమండలం గ్రామంలో వీఆర్వో తీరు వివాదాస్పదంగా మారింది. వివరాల్లోకెళితే... మొదటి భార్య సంతానం ఉండగానే రెండో భార్యకు మాత్రమే సంతానం ఉందని ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ చేయడం వివాదాలకు దారితీస్తోంది. నందిమండలం వాసి షేక్ వడ్ల మహబూబ్ సాహెబ్‌కు ఇద్దరు భార్యలు. మొదటి భార్య మస్తాన్‌బీకి బాబావాజిద్ అనే కుమారుడు ఉన్నారు. రెండో భార్య హుస్సేన్‌బీకి ఖాదర్‌బాష అనే కుమారుడు, మహబూబ్‌చాన్ అనే కుమార్తె ఉంది. అయితే మొదటి భార్య కొడుకు బాబావాజిద్ వృత్తిరీత్యా సౌదీలో ఉన్నాడు. తండ్రి ఆస్తిని కాజేసేందుకు రెండో భార్య కుమారుడు ఖాదర్‌బాష వీఆర్వోను సంప్రదించాడు. వీఆర్వో అందుకు సహకరించి ఈ ఏడాది జనవరి 20వ తేదీ మొదటి భార్య కుమారుడు లేకుండానే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను జారీ చేశాడు. అంతా సవ్యంగా సక్రమంగా ఉంటేనే రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిప్పుకునే అధికారులు ఇలా డబ్బుకు ఆశపడి సర్టిఫికెట్ జారీచేయడం మండలంలో హాట్ టాపిక్‌గా మారింది. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ చేయడం అంటే ఆర్ఐ విచారించి ఆ వివరాలు తహసీల్దార్‌కు తెలియపరచాలి. అయితే ఇక్కడ మాత్రం డబ్బు చేతులు మారడంతో ఎలాంటి విచారణ చేయకుండా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇచ్చారని దుమారం లేపుతోంది. మొదటి భార్య కొడుకు బాబావాజిద్ ప్రస్తుత తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మకు ఫిర్యాదు చేయడంతో ఈ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ వెలుగులోకి వచ్చింది. ఈ సందర్భంగా ప్రస్తుత తహసీల్దార్ మాట్లాడుతూ సర్టిఫికెట్ జారీ చేసిన మాట వాస్తవమేనని, విచారణకు ఆదేశించామని, ఈ సర్టిఫికెట్‌పై రీఒకేషన్ కోరుతూ జేసీకి పంపినట్లు తెలిపారు. ఈసర్టిఫికెట్ ఆధారంగానే రూ.50లక్షలు విలువ చేసే స్థలాన్ని ఖాదర్‌బాష అమ్మినట్లు బాబా వాజిద్ తెలిపారు. తనకు తమ్ముడైన ఖాదర్‌బాష అందుకు సహకరించిన వీఆర్వోపై పెండ్లిమర్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు.



REVENUE DEPARTMENT

...C.Chandra Sekhar Varma.,M.Sc
...hsildar,
...ndimarri Mandal

To
The Joint Collector,
Y.S.R.District
Kadapa.

Ref.No.A/94/2024, Dated: 17.05.2024

Sub:- Family Member Certificate - Nandimandalam Village - Pendlimarri Mandal - A/o Sri S.Vadla Hussian W/o V.Mabu - FAMC240123046985 - Approved on Dated: 25.01.2024.- Objection filed by Sri S.Vadla Baba Vazeed - Revocation of FMC - Requested -Regarding.

Ref.No.1. Application of S.Vadla Baba Vazeed of Nandimandalam Village of Pendlimarri Mandal, Dated: 24.04.2024.

I invite kind attention to the Reference Cited.

I submit that Sri Shaik Vadla Baba Vazeed S/o Mabu Sab, the first wife son of late Vadla Mabu Saheb has applied for issue of F.M.C. requesting to cancel the F.M.C issued earlier suppressing the facts that his aunty (Second Wife of his father) has obtained the FM.C without mentioning his name.

I therefore, request to revoke the application bearing No. FMC240123046985 issued to Smt. S.Vadla Hussian Bi for taking further action in the matter.

ప్రస్తుత తహసీల్దార్ రీఒకేషన్ కోరుతూ జేసీకి పంపిన సర్టిఫికెట్

రాజంపేట మున్సిపల్ ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఆకేపాటి

రాజంపేట, జూలై 3: రాజంపేట మున్సిపల్ ఎక్స్ అఫీషియో సభ్యుడిగా నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అమర్‌నాథ్‌రెడ్డి చేత ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ రాజంపేట మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలకతీతంగా అందరం కలిసి రాజంపేట పట్టణాన్ని అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో 11 అజెండాలను సభ ముందు పెట్టి కౌన్సిల్ సభ్యులు ఆమోదం పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సభ్యులందరితో మాట్లాడారు. కేవలం 15 నిముషాలు మాత్రమే మున్సిపల్ సమావేశాన్ని నిర్వహించారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

సుండుపల్లె, జూలై 3: ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన షాజహాన్ కుటుంబానికి రూ.2 లక్షల చెక్కును అందజేసినట్లు రాయవరం ఏపీజీబీ శాఖ మేనేజర్ ఏ.భానుప్రకాశ్ తెలిపారు. రాయవరానికి చెందిన షాజహాన్ గతంలో తమ బ్యాంకులో ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం కింద రూ.436 చెల్లించి బీమా తీసుకున్నారని, ఆయన ప్రమాదంలో మృతి చెందడంతో అతని కుటుంబానికి ప్రభుత్వం నుంచి వచ్చిన మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ వికాస్, నరసింహారావు, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంద్‌ను జయప్రదం చేయండి

గాలివీడు, జూలై 3: నేడు విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏపీఎస్ఎఫ్ కడప, చిత్తూరు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పరీక్షల లీకేజీపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ పలు విద్యార్థి సంఘాల నాయకులతో దేశ వ్యాప్తంగా స్కూళ్లు, కళాశాల బంద్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. లీకేజీకి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను సమర్థవంతంగా నిర్వహించండి

- ప్రయోగ పద్ధతిలో పాఠ్యబోధన చేయండి
- కడప ఆర్జేడీ రాఘవరెడ్డి పిలుపు



శిక్షణా ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఆర్జేడీ

రాయచోటిటౌన్, జూలై 3: అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను సమర్థవంతంగా నిర్వహించి, ప్రయోగ పద్ధతిలో పాఠ్యాంశాల బోధన చేయాలని కడప ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు (ఆర్జేడీ) రాఘవరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని మాసాపేటలో గల జడ్పీ ఉన్నత పాఠశాలలో రీజియన్ లెవల్ అటల్ ల్యాబ్‌ల వర్క్‌షాప్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని కడప ఆర్జేడీ రాఘవరెడ్డి, డీఈఓ శివప్రకాశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ పాత బోధన విధానానికి స్వస్తి పలకాలని, ప్రయోగాలు నిర్వహిస్తూ, పాఠ్యబోధన జరపాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను ఉపయోగించుకొని విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంపొందింపజేయాలన్నారు. అనంతరం డీఈఓ శివప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ గ్రేటర్ రాయలసీమ పరిధిలోని 10 జిల్లాల జిల్లా సైన్స్ అధికారులకు, హబ్ ఏటీఎల్ ప్రధానోపాధ్యాయులకు, ఇన్‌చార్జి టీచర్లకు నేటి నుంచి మూడు రోజుల పాటు వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యానిసెఫ్ ప్రతినిధి సుదర్శన, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివకుమార్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, ఏఎంఓ సమీవుల్లా, డీసీఈబీ సెక్రటరీ నాగమునిరెడ్డి, నోడల్ టీచర్ ఆంజనేయులు, గ్రేటర్ రాయలసీమ 10 జిల్లాల నుంచి హబ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, డిస్ట్రిక్ట్ సైన్స్ ఆఫీసర్లు, అటల్ టింకరింగ్ ల్యాబ్ ఇన్‌చార్జి టీచర్లు పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ చేయాలి : బీజేపీ



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేత రమేష్‌నాయుడు

రాజంపేట, జూలై 3: ఏపీఎండీసీ మాజీ ఎండీ వెంకటరెడ్డి అవినీతిపై సీబీసీఐడీ విచారణ చేసి అతనిపై కఠినచర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమష్‌నాయుడు డిమాండ్ చేశారు. రాజంపేట బీజేపీ కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ వెంకటరెడ్డి గత మూడేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని నదుల్లో ఇసుకను అక్రమ రవాణా చేయించి వైసీపీ నేతలకు అక్రమంగా రూ.కోట్లు దోచుకునేలా చేశారని ఆరోపించారు. మంగంపేట ముగ్గురాయిని ఇష్టారాజ్యంగా తవ్వేసి ఏ గ్రేడు రాయిని సీ గ్రేడుగా చూపించి వందల కోట్లకు పడగలెత్తారని విమర్శించారు. ఇతని అవినీతి భాగోతం వెనుక వైసీపీ పెద్దలు ఉన్నట్లు ఆరోపించారు. అవినీతి సొమ్ముపై ప్రత్యేకంగా విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆదినారాయణ, నాగరాజు, రమణ, నవీన్‌కుమార్, ప్రవీణ్ కుమార్, వేణుగోపాల్ ఆచారి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అభివృద్ధికి మట్టి నమూనాల సేకరణ : జేడీఏ



రైతు పొలంలో మట్టి నమూనా సేకరిస్తున్న జేడీఏ చంద్రానాయక్

సుండుపల్లె, జూలై 3: రైతుల వ్యవసాయాభివృద్ధికి మట్టి నమూనాల సేకరణ ఎంతో దోహదపడుతుందని వ్యవసాయశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ చంద్రానాయక్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు రామయ్య పొలంలో మట్టి నమూనా సేకరణ చేసినట్లు తెలిపారు. మట్టి నమూనాల సేకరణ వలన రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించామన్నారు. సుండుపల్లె పరిసర ప్రాంతాల్లో భూమిలో భాస్వరం, పొటాస్, నత్రజని ఎరువులు సమానంగా ఉండేలా చూసుకోవాలని, భూసార పరీక్షల ఫలితాల ఆధారంగానే రైతులకు ఎరువులు సిఫారసు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. వ్యవసాయం ద్వారా రైతుల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలియజేశారు. అనంతరం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి మహబూబ్‌బాషా, టెక్నికల్ ఏవో వెంకటమోహన్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంఘాలకు ప్రాధాన్యత



సమావేశంలో మాట్లాడుతున్న ఏరియా కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి

వీరబల్లి, జూలై 3: రైతు సంఘాలకు ప్రాధాన్యత ఉంటుందని రాయచోటి ఏరియా కోఆర్డినేటర్ కొండా శ్రీనివాసులరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన మండల రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య మహాజన సభ సమావేశంలో మాట్లాడుతూ రైతు సంఘాలకు వ్యవసాయానికి పెట్టుబడి, బ్యాంక్ రుణాల మంజూరు చేస్తామని, అలాగే సంబంధిత ప్రభుత్వ శాఖలతో అనుసంధానం చేస్తామన్నారు. జిల్లా రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య కోఆర్డినేటర్ గంగార్జున మాట్లాడుతూ రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడానికి జిల్లాలోని 9 మండలాల్లో ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకట్రామిరెడ్డి, కార్యదర్శిగా రామయ్య, ఉప కార్యదర్శిగా షేక్.సలీం, కోశాధికారిగా పి.రామ్‌ప్రసాద్‌లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏపీఎం ఖాదర్‌వలి, సీసీ వెంకటలక్ష్మి, అకౌంటెంట్ మరియమ్మ, బీఓడీ సభ్యులు పాల్గొన్నారు.

పేదల కోసం భూపోరాటానికి సిద్ధం: సీపీఐ



ఆక్రమిత భూమిలో మాట్లాడుతున్న పండుగోల మణి

రైల్వేకోడూరు, జూలై 3: పేదల కోసం భూపోరాటానికి సిద్ధమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి, కోడూరు సీపీఐ ఏరియా అధ్యక్షుడు జ్యోతి చిన్నయ్యలు తెలిపారు. మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ పరిధిలో 300 ఎకరాలకు పైబడి ఉన్న ప్రభుత్వ భూమిని ఐబీసీ కంపెనీ వారు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఈ క్రమంలో బుధవారం ఆక్రమిత భూమిని మండల సీపీఐ కార్యదర్శి దార్ల రాజశేఖర్ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంతరాజుపేట పంచాయతీలోని సర్వే నెంబరు 1/4లో దాదాపు 300 ఎకరాల పైబడిన ప్రభుత్వ భూమిని ఐబీసీ కంపెనీ ఆక్రమించుకుని దర్జాగా అనుభవిస్తుందని, దళితులు, గిరిజనులకు భూమి లేకుండా చేశారని ఆరోపించారు. ఇదిలా ఉండగా తమ కంపెనీ ప్రభుత్వానికి సంబంధించిన భూమిని ఎక్కడా ఆక్రమించుకోలేదని, కొన్ని సంఘాల వారు కావాలనే తమ ఆధీనంలో ఉన్న భూమిపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఐబీసీ కంపెనీ యాజమాన్యం తెలిపింది. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి మొగిలి వినయ్, నాయకులు శివ, దళితులు, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

ఒంటిమిట్ట, జూలై 3: విద్యార్థుల్లో డయేరియాపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రామచంద్రయ్య అన్నారు. స్టాఫ్ డయేరియాపై మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి పిల్లలకు అవగాహన కల్పించారు. పారిశుధ్యం, పరిశుభ్రత గురించి వివరించారు. నీటి కలుషితం కావడం వల్ల పిల్లల్లో విరేచనాలు, వాంతులు ఏర్పడే ప్రమాదం ఉందని, ఎప్పటికప్పుడు ట్యాంకులను శుభ్రపరచాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మండలంలోని పోలా హాస్టల్ సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న భోజన సదుపాయం గురించి ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కుమార రంగయ్య, ఎంఈవో వెంకటసుబ్బయ్య, ప్రధానోపాధ్యాయురాలు వెంకటలక్షమ్మలు పాల్గొన్నారు.

పింఛన్లలో చేతివాటంపై విచారణ



పెన్షన్ లబ్ధిదారులను విచారిస్తున్న ఈవోఆర్డీ

పుల్లంపేట, జూలై 3: మండల పరిధిలోని టి.కమ్మపల్లె పంచాయతి కృష్ణంపల్లె గ్రామంలో పింఛన్ల పంపిణీలో చేతివాటంపై బుధవారం ఎంపీడీవో నరసింహమూర్తి ఆదేశాల మేరకు ఈవోఆర్డీ పెంచలయ్య విచారణ చేపట్టారు. పెన్షన్ల పంపిణీలో చేతివాటంపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఈనెల 2న శీర్షిక వెలువడడంతో అధికారులు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పెన్షన్ లబ్ధిదారులందరిని ఒకచోటికి పిలిపించి తూతూమంత్రంగా విచారణ చేపట్టారు. ఒక్కో పింఛను లబ్ధిదారుని నుంచి రూ.200 సచివాలయ సిబ్బంది, వలంటీర్ వసూలు చేసిన విషయం ఆంధ్రజ్యోతి బయట పెట్టడంతో నిజాలను కప్పిపుచ్చుతూ అధికారులు తూతూమంత్రంగా ఏమీ జరగలేదన్నట్లు విచారణ పూర్తి చేశారు.

ఘనంగా సామూహిక సీమంతాలు

చిట్వేలి, జూలై 3: రాజుకుంటలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం సామూహిక సీమంతాల వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీడీపీవో రాజేశ్వరి మాట్లాడుతూ తల్లి సౌభాగ్యాన్ని, బిడ్డ దీర్ఘాయుష్షును కోరుతూ చేసేదే సీమంతం వేడుకని, ఈ వేడుక ప్రతి గర్భిణీకి జీవితంలో ముఖ్యమైన ఘట్టమన్నారు. అనంతరం 15 మంది గర్భిణీలకు సామూహిక సీమంతం నిర్వహించారు. ఇన్‌చార్జి తహసీల్దారు సుమని మాట్లాడుతూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఇలాంటి సామూహిక వేడుకలు నిర్వహించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చెంగమ్మ, గ్రేడ్-1 సూపర్‌వైజర్లు వసుంధరమ్మ, విశాలాక్షి, సురేఖరాణి, జీఎంఎస్ శోభా, ఏఎన్ఎం ఫరీదా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, అంగన్వాడీ వర్కర్లు మాధవి, సుబ్బలక్ష్మి, శ్రీదేవి, రాజేశ్వరి, హెల్పర్లు, ఆశావర్కర్లు బాలమ్మ, మహిళలు, పిల్లలు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన కోడూరు నేతలు



కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడును సత్కరించిన కోడూరు నాయకులు

రైల్వేకోడూరు, జూలై 3: కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడును బుధవారం ఢిల్లీలోని మంత్రి కార్యాలయంలో బుధవారం టీడీపీ సీనియర్ నాయకుడు మలిశెట్టి మురళీధర్‌గౌడ్, ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి చలపాటి హరినాథ్, రాజమోహన్‌రాజులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడం, కేంద్రంలో బీజేపీ అధికార పగ్గాలు ముచ్చటగా మూడోవసారి చేపట్టడంతో ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఇటు రాష్ట్రంలో, అటు కేంద్రంలో ప్రజా ప్రభుత్వాలు ఉండడంతో పేదలకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి రామ్మోహన్‌నాయుడును ఘనంగా సత్కరించారు.

మహనీయుడు సీఎం చంద్రబాబు

- సీఎం చంద్రబాబు, మండిపల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం



రాయచోటి టీడీపీ కార్యాలయం వద్ద సీఎం చంద్రబాబు, మంత్రి మండిపల్లి ఉన్న ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగ నేతలు

రాయచోటిటౌన్, జూలై 3: దివ్యాంగులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటలను నిలబెట్టుకున్నారని చెవి, మూగ, అసోషియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు మణికంఠరెడ్డి, రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమశాఖ రాష్ట్ర అధ్యక్షులు రంగారెడ్డిలు అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం దివ్యాంగులకు పింఛన్లు పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీలో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా దివ్యాంగులకు పింఛన్‌ను పెంచుతానని హామీ ఇవ్వడం జరిగిందని, ఇచ్చిన హామీ మేరకు జూలై 1వ తేదీన పెంచిన పింఛన్ రూ.6 దివ్యాంగులకు అందజేయడం జరిగిందన్నారు. దీంతో దివ్యాంగులకు చెప్పిన మాట పప్రకారం పింఛన్‌ను అందజేయడంతో అన్నమయ్య జిల్లా కేంద్రంలో దివ్యాంగ సంక్షేమ శాఖ నేతలు, దివ్యాంగుల కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి తమ అభిమానాన్ని చాటుకొన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగ సంక్షేమ శాఖ నాయకులతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన దివ్యాంగులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళపై బంధువు అత్యాచారయత్నం

వీరబల్లి, జూలై 3: మండల పరిధిలోని ఓ మహిళపై వరుసకు బావ అయిన అదే గ్రామానికి చెందిన పెద్ద రెడ్డెయ్య అత్యాచారయత్నానికి పాల్పడినట్లు బాధితురాలు పేర్కొంది. స్నానం చేయడానికి బాత్‌రూంలోకి వెళ్లగా ఈ ఘాతుకానికి పాల్పడినట్లు ఆరోపించింది. ఈ మేరకు తమకు న్యాయం చేయాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కాగా అక్కడ పోలీసు సిబ్బంది తనను అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు, అసభ్యకరంగా ప్రవర్తించారని ఆరోపించింది. ఈ నేపథ్యంలో విషద్రావణం సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు హుటాహుటిన రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై ఎస్ఐ చంద్రమోహన్‌ను వివరణ కోరగా... తమ సిబ్బంది ఎవరూ ఆమెపై దురుసుగా ప్రవర్తించలేదని, అవన్నీ అవాస్తవాలని తెలిపారు. కొందరు నిజానిజాలు తెలుసుకోకుండా వాట్స్ఎగ్రూప్‌లో ట్రోల్ చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. కాగా బాధితురాలి ఫిర్యాదు మేరకు అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వభూమి ఆక్రమణపై ఆర్డీవోకు ఫిర్యాదు

పుల్లంపేట, జూలై 3: మండల పరిధిలోని తిప్పాయపల్లె గ్రామంలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతుందని గ్రామస్థులు, ఆర్డీవో మోహన్‌కృష్ణకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆర్డీవో విచారణ చేపట్టాలని పుల్లంపేట తహశీల్దారు వెంకటనారాయణను బుధవారం ఆదేశించారు. దీంతో ఆర్ఐ నవీన్, వీఆర్‌వో వెంకటసుబ్బయ్యలు సర్వేనంబరు 542/6లో 4.98 ఎకరాల భూమిలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

చిన్నమండెం, జూలై 3: మండలంలోని దేవగుడిపల్లె గ్రామ పంచాయతీలో శ్రీమండెం నది ఒడ్డున వెలిసిన పురాతన ఆలయమైన శ్రీమండెం లక్ష్మీనరసింహారెడ్డి నూతన కట్టడాన్ని ఈవో కొండారెడ్డి, పురావస్తుశాఖ ఏఈ శ్రీనివాసులు, ఎండోమెంట్ దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి శ్రీకాంత్ దేవాలయం పనులను పరిశీలించి నాణ్యమైన, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఈవో కొండారెడ్డి ఆదేశించారు.

రాజంపేట టీడీపీ నేతలతో సుగవాసి భేటీ



టీడీపీ నేతలతో భేటీ అయిన సుగవాసి బాలసుబ్రమణ్యం

రాజంపేటటౌన్, జూలై 3: రాజంపేట టీడీపీ నాయకులతో నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం భేటీ అయ్యారు. బుధవారం ఆర్అండ్‌బీ బంగ్లాలో టీడీపీ నాయకులతో మాట్లాడారు. ఆయా ప్రాంత టీడీపీ నాయకులు వారి సమస్యలను బాలసుబ్రమణ్యం దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా తమ గ్రామాలను అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజంపేట మున్సిపల్ టీడీపీ ఫ్లోర్‌లీడర్ తుపాకుల అశోక్, రాజంపేట పార్లమెంట్ టీడీపీ లీగల్‌సెల్ నేత టి.లక్ష్మీనారాయణ, మండల టీడీపీ నాయకుడు మేకా నరసింహులు, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్‌వి రమణ, మాజీ కౌన్సిలర్ గుగ్గిళ్ల చంద్రమౌళి, రాజంపేట పట్టణ అధ్యక్షుడు సంజీవరావు, జనసేన పార్టీ నాయకులు శివ, మాజీ సర్పంచ్ తోట రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన మద్యం ధ్వంసం



సీజ్ చేసిన మద్యాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు

నందలూరు, జూలై 3: రాజంపేట సబ్ డివిజన్‌లోని నందలూరు, చిట్వేలి, రాజంపేట అర్బన్ పోలీసుస్టేషన్లలో నమోదైన 27 కేసుల్లో సీజ్ చేసిన రూ.71,753 విలువ చేసే 472 మద్యం బాటిళ్లను రాజంపేట సబ్‌డివిజన్ పోలీసులు బుధవారం ధ్వంసం చేశారు. ఎస్పీ క్రిష్ణారావు ఉత్తర్వుల మేరకు జిల్లా అడిషనల్ ఎస్పీ డాక్టర్ రాజ్‌కమల్, ఎస్ఈబీ ఈఎస్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రాజంపేట సబ్ డివిజన్‌లో నమోదైన కేసుల్లోని సీజ్ చేసిన మద్యాన్ని మండలంలోని ఆల్విన్ ఫ్యాక్టరీ వద్దనున్న చెట్లలో డోజర్ ద్వారా నేలమట్టం చేశారు. ఈ కార్యక్రమంలో నందలూరు, రాజంపేట, చిట్వేలి ఎస్ఐలు అబ్దుల్ జహీర్, వెంకటేశ్వర్లు, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు సర్వీసు నడపాలని డీఎంకు వినతి



డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాజంపేట, జూలై 3: మండలంలోని సానిపాయి నుంచి సుండుపల్లె మీదుగా పీలేరుకు బస్సు నడపాలని రాజంపేట ఆర్టీసీ డీఎం రమణయ్యకు జనసేన, టీడీపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం రాజంపేట ఆర్టీసీ డిపో కార్యాలయంలో డీఎంకు జనసేనపార్టీ పార్లమెంట్ నాయకులు రామా శ్రీనివాస్, జనసేన లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు కత్తి సుబ్బరాయుడు, టీడీపీ పార్లమెంట్ లీగల్‌సెల్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ, రాజంపేట పట్టణ మాజీ టీడీపీ అధ్యక్షుడు టి.సంజీవరావు, పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరి కొండా శ్రీనివాసులు, జనసేన యువ నాయకులు అబ్బిగారి గోపాల్, ఎస్సీ సెల్ నాయకులు శ్రీనివాసులు తదితరులు వినతి పత్రం సమర్పించారు. ఆర్టీసీ ఉన్నతాధికారులకు ఈ విషయాన్ని తెలియజేసి చర్యలు తీసుకుంటామని డీఎం వారికి హామీ ఇచ్చారు.

దివ్యాంగుల కోసం ప్రభుత్వ ప్రోత్సాహం

రాజంపేట, జూన్ 3: రాష్ట్రంలో దివ్యాంగుల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్నిరకాలుగా కృషి చేస్తోందని జిల్లా సమ్మిళిత విద్యాశాఖాధికారి బి.జనార్దన్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని మన్నూరు ఉన్నత పాఠశాల ఆవరణంలో రాజంపేట, కోడూరు నియోజకవర్గాలకు చెందిన దివ్యాంగ పిల్లలకు ఉచిత ఉపకరణాల పంపిణీ కొరకు జరిగిన నిర్ధారణ పరీక్షలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నిర్ధారణ పరీక్షలకు 120 మంది హాజరయ్యారని, వీరికి కావాల్సిన వీల్ చైర్‌లు, ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలు తదితర అన్ని ఉపకరణాలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు రఘునాథ్‌రాజు, సుబ్బరాయుడు, చక్రధర్‌రాజు, హెడ్మాస్టర్ పరిమళ, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

పదవీ విరమణ తప్పనిసరి

సుండుపల్లె, జూలై 3: పదవీ విరమణ ప్రతిఒక్కరికీ తప్పనిసరి అని పలువురు ఉపాధ్యాయులు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా సేవలందించిన మేకల రామచంద్రయ్య పదవీ విరమణ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. 40 సంవత్సరాలు ఉపాధ్యాయ వృత్తిలో సేవలందించి ఎందరో విద్యార్థినీ, విద్యార్థులను, విద్యావంతులను చేసి పదవీ విరమణ పొందడం సంతోషంగా భావించాలన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్టీయూ, ఏపీటీఎఫ్ అధ్యక్షుడు శివారెడ్డి, శ్రీహరిబాబు, పీఆర్‌టీయూ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరాజు, మండల విద్యాశాఖ అధికారులు వెంకటేశ్‌నాయక్, రవీంద్రనాయక్, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో అంతా అవినీతే

● సంక్షేమ పథకాలన్నీ ఆ పార్టీ కార్యకర్తలకే
● జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యేల ధ్వజం ● అధికారులపై ప్రశ్నల వర్షం

చిత్తూరు రూరల్, జూలై 3: వైసీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి రాజ్యమేలిందని ఎమ్మెల్యేలు ధ్వజమెత్తారు. ఐదేళ్లలో ఎప్పుడూ జరగనివిధంగా బుధవారం జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. కొత్త ఎమ్మెల్యేలైనా అధికారులను గుక్క తిప్పుకోనీయకుండా గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, జరగని అభివృద్ధిపై నిలదీశారు. ఉదయం 11 గంటలకు జరగాల్సిన సమావేశం మొదట కోరానికి కావాల్సి సభ్యులు రాకపోవడంతో కాసేపు వాయిదా వేశారు. మెల్లగా 28 మంది వరకు జడ్పీటీసీ సభ్యులు హాజరుకావడంతో సమావేశాన్ని మొదలు పెట్టారు. సమావేశం మొదలైన కాసేపటికే చిత్తూరు, పూతలపట్టు, జీడీనెల్లూరు, చంద్రగిరి ఎమ్మెల్యేలు సమావేశానికి వచ్చారు. వచ్చీరాగానే అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. వీరి ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అధికారులు నిల్చుండిపోయారు. 2 గంటలకు ముగియాల్సిన సమావేశం సాయంత్రం 4 గంటల వరకు సాగింది. ఇది సర్వసభ్య సమావేశాన్ని తలపించింది.



సమావేశంలో హాజరైన సభ్యులు, అధికారులు

పసుపు కండువాతో వైసీపీ జడ్పీటీసీలు



ఎన్నికలకు ముందు టీడీపీలో చేరిన ముగ్గురు వైసీపీ జడ్పీటీసీలు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశానికి పసుపు కండువాలతో హాజరయ్యారు. వీరిలో తిరుమలయ్య (ఏర్పేడు), వెంకట సుబ్బారెడ్డి (శ్రీకాళహస్తి), పి.అర్చనదేవి (తొట్టంబేడు) ఉన్నారు.

● అలాగే, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం కుమారుడు నారాయణ వనం జడ్పీటీసీ సుమన్ తనతో పాటు సత్యవేడు, కేవీబీపురం, వరదయ్యపాళ్యం, బీఎన్ కండ్రిగ జడ్పీటీసీలతో కలిసి సమావేశానికి హాజరయ్యారు.

సీఎం చంద్రబాబు చిత్రపటం ఎక్కడ?



ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరించి 20 రోజులు కావస్తున్నా చిత్రపటాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదని ఏర్పేడు జడ్పీటీసీ తిరుమలయ్య ప్రశ్నించారు. సమావేశం మొదలు కాగానే.. సీఎం చిత్రపటం లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలను హాలులో ఏర్పాటు చేయాలని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సీఈవో గ్లోరియాను కోరారు. ఆ తర్వాత అధికారులు సీఎం చంద్రబాబు చిత్రపటాన్ని ఏర్పాటు చేశారు. జడ్పీటీసీ సభ్యులైనప్పటికీ తమ పేర్లను శిలాఫలకాల్లో అధికారులు వేయడం లేదని, తిరిగి తమ పేర్లతో ఉన్న నూతన ఫలకాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు.

పెండింగ్ బిల్లుల్ని విడుదల చేయండి



టీడీపీ ప్రభుత్వంలో చేసిన పనులకు కేవలం ఆ పార్టీ వారనే కారణంగా కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వలేదు. వడ్డీలకు తెచ్చి పనులు చేస్తే బిల్లులు ఆపేస్తే ఎలా? వెంటనే పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ విడుదల చేయాలి. గత ఐదేళ్లలో చిత్తూరు నియోజకవర్గంలో ఎక్కడ చూసినా అవినీతి, అక్రమాలు తప్ప అభివృద్ధి జరగలేదు. ఎక్కడ చూసినా సమస్యలే. తాగునీటినీ సక్రమంగా సరఫరా చేయని దౌర్భాగ్య పరిస్థితులున్నాయి. ఇక, సంక్షేమ పథకాలన్నీ వైసీపీ కార్యకర్తలకే అందించారు. కాజూరు ప్రాంతానికి చెందిన ఓ వైసీపీ నేత అంగవైకల్యం లేకుండానే పింఛన్లు, ప్రభుత్వం నుంచి ట్రై స్కూటర్ పొందాడని 'ఆంధ్రజ్యోతి'లో వచ్చింది. ఇక, టీడీపీ ప్రభుత్వం ఏర్పడి నెల రోజులవుతున్నా జడ్పీ సమావేశ మందిరంలో సీఎం చంద్రబాబు చిత్రపటాన్ని ఏర్పాటు చేయకపోవడం దారుణం. ఇక మాత్రం క్రమశిక్షణతో అభివృద్ధి చేయకపోతే మేముగానీ, సీఎంగానీ ఒప్పుకొనే పరిస్థితి లేదు.

- గురజాల జగన్మోహన్, చిత్తూరు ఎమ్మెల్యే

కొండలు, గుట్టలూ వదల్లేదు



జీడీనెల్లూరు నియోజకవర్గంలోని రైతులకు నాణ్యమైన విద్యుత్తు అందక మోటార్లు, స్టాటర్లు కాలిపోతున్నాయి. రైతులకు నాసిరకం కరెంటు ఇచ్చి.. క్వారీలకు, గ్రానైట్ ఫ్యాక్టరీలకు మాత్రం 24 గంటలూ నాణ్యమైన విద్యుత్తు సరఫరా అందిస్తున్నారు. సబ్‌స్టేషన్లలో పనిచేసే షిఫ్ట్ ఆపరేటర్లు చాలా మంది రాత్రిళ్లు మద్యం తాగి పడుకుంటున్నారు. విద్యుత్ సరఫరా ఆగినప్పుడు ఫోన్ చేసినా పలకడం లేదు. ఒకవేళ ఫోనుతీసినా సమాధానం చెప్పడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై విచారించి వారిని తొలగించాలి. కృష్ణాపురం ప్రాజెక్టును మరమ్మతు చేయకుండా దీనికి అరకిలోమీటరు కూడా లేని కత్తెరపల్లి ప్రాజెక్టును రూ.84 కోట్లతో మంజూరు చేయడం దారుణం. కేవలం కమీషన్ల కోసమే మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఇలా చేశారు. చెరువులు, ప్రభుత్వ భూములు, కొండలను సైతం నారాయణస్వామి వదిలిపెట్టలేదు. పెనుమూరులోని సర్వే నెంబరు 430లో గత ప్రభుత్వం జగనన్న కాలనీ పేరుతో 85 ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తే అందులో 75 ఇళ్లు వైసీపీ నాయకులకే ఇచ్చారు. అర్హత లేకున్నా 3 నుంచి 5 సెంట్ల వరకు ఇచ్చారు. ఒక్కో వైసీపీ నాయకుడు మూడేసి పట్టాలు పొందారు. దీనిపై విచారించి పట్టాలు రద్దు చేయాలి. ఎస్ఆర్ పురం మండలంలోని ఓ సర్పంచ్ కూడా భర్త బతికుండగానే ఒంటరి మహిళ అని చెప్పుకొని పింఛను పొందుతోంది. ఇంతలా వైసీపీ నాయకులు దిగజారారు. వైద్య ఆరోగ్య శాఖలో పోస్టులన్నీ కూడా మాజీ మంత్రి పెద్దిరెడ్డి నియోజకవర్గం, వైసీపీ కార్యకర్తలకు కేటాయించారని సమాచారం ఉంది. దీనిపై పూర్తి వివరాలను మాకు అందించాలి.

- థామస్, జీడీనెల్లూరు ఎమ్మెల్యే

కొత్త ఎమ్మెల్యేల మాట

కాంట్రాక్టు ఉద్యోగాలన్నీ పెద్దిరెడ్డి, చెవిరెడ్డి వర్గాలకే



జిల్లాలోని పలు శాఖల్లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలన్నీ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి అనుచరులకే కేటాయించారు. డీఆర్డీఏలో ఇప్పటికీ పలు హోదాల్లో ఉంటూ కొందరు వైసీపీ సర్వేల కోసం పనిచేశారు. తుడాలో కాంట్రాక్టు లేబర్ పేరుతో 60 మందికి పైగా చెవిరెడ్డి ఇంటి వద్ద పీఆర్వోలుగా, వైసీపీ సంబంధించిన పనులు చేస్తున్నారు. వీళ్లకు ఇప్పటికీ తుడా నుంచి జీతాలు అందుతున్నాయి. తిరుపతి రూరల్ తుమ్మలగుంట చెరువులో అభివృద్ధి పేరిట రూ.వంద కోట్ల తుడా నిధులతో చెవిరెడ్డి భారీ స్కాం చేశాడు. నేను అభివృద్ధికి వ్యతిరేకం కాదు. కానీ, ఆ చెరువులో పార్కులు, కట్టడాల వల్ల గతంలో కురిసిన వర్షాలకు అవిలాల, సాయినగర్, గాంధీపురం, ఓటేరు, పేరూరు ప్రాంతాల్లో వరద ప్రవహించి దెబ్బతిన్నాయి. చెరువులో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదన్న నిబంధనలున్నా.. తుమ్మలగుంట చెరువులో మాత్రం ఈ పనులకు నిధులు ఎలా విడుదల చేశారు? వీటికి బాధ్యులైన అధికారులను సస్పెండు చేయాలి. ఇక, మామండూరు జగనన్న కాలనీలో చెవిరెడ్డి దగ్గర పనిచేసే గన్‌మ్యాన్, పీఆర్వోలు, వైసీపీ నాయకులకు వారి బినామీ పేర్లతో ఇచ్చిన పట్టాలను రద్దు చేయాలి. తిరుపతి రూరల్‌కు తెలుగు గంగ నీటి సరఫరా కోసం గతంలో ఇచ్చిన జీవోను అమలు చేసి కొత్తగా టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలి. అలాగే కార్యదర్శులతో చెవిరెడ్డి కాన్ఫరెన్స్‌లోకి తీసుకొని మాట్లాడటంపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి.

- పులివర్తి నాని, చంద్రగిరి ఎమ్మెల్యే

ఐదేళ్లలో అభివృద్ధినే మరిచారు



ఈ ఐదేళ్లలో పూతలపట్టు నియోజకవర్గంలో అభివృద్ధిని పట్టించుకోలేదు. కొన్ని గ్రామాల్లో తాగునీరు లేకుంటే, మరికొన్నిగ్రామాల్లో కాలువలు, రోడ్లు సరిగా లేవు. తవణంపల్లె మండలం టీ కొత్తూరు గ్రామంలో బోరు మోటరు కాలిపోతే నిధుల్లేక ఆ సర్పంచి ఏం చేయాలో తెలియక ఇబ్బంది పడ్డారు. గడిచిన ఐదేళ్లలో రూ.126 కోట్లతో అభివృద్ధి చేసినట్లు రికార్డుల్లో చెబుతున్నా.. అవెక్కడా కనపడడం లేదు. కనీసం వారానికి ఒకసారి తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయడం లేదు. ప్రజలు డయేరియాతో అల్లాడిపోతున్నారు. ఇకనైనా ప్రతి వారం ట్యాంకును శుభ్రం చేయించి.. ఆ ఫొటోలను తెప్పించుకోండి. ఇకపై అధికారుల పనితీరులో జవాబుదారీతనం ఉండాలి. బాగున్నవారూ అంగవైకల్యం పింఛన్లు తీసుకుంటుండటంపై విచారించాలి. గత ప్రభుత్వంలో ఐరాల మండలం, నాంపల్లి రెవెన్యూ గ్రామానికి చెందిన ఓ పిల్లవాడు 100 శాతం అంగవైకల్యంతో ఉన్నా ఏవో కారణాలు చూపి పింఛన్ ఇవ్వకపోవడంపై 'ఆంధ్రజ్యోతి'లో చదివి ఆశ్చర్యపోయా. ఇవన్నీ మారాలి లేదంటే మారుస్తా.

- మురళీమోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే

హైకోర్టు అసిస్టెంట్ ప్లీడర్‌గా శరత్‌కుమార్



కుప్పం, జూలై 3: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అసిస్టెంట్ ప్రభుత్వ ప్లీడర్‌గా కుప్పానికి చెందిన ఎస్.శరత్‌కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి నరేశ్ అభినందనలు తెలిపారు. నీతి నిజాయితీలతో కూడిన పనితీరుతో శరత్‌కుమార్ మరిన్ని పదవులు అధిష్ఠించాలని ఆయన ఆకాంక్షించారు.

మమ్మల్ని ఆదుకోండి

పోలీసులకు వృద్ధ దంపతుల ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వచ్చిన వృద్ధ దంపతులు

పుంగనూరు రూరల్, జూలై3: 'కన్న కొడుకులే ఇంటి నుంచి బయటకు గెంటేశారు... తమను పోలీసులే ఆదుకుని న్యాయం చేయాలంటూ' వృద్ధ దంపతులు బుధవారం పోలీసుకు ఫిర్యాదు చేశారు. పుంగనూరు మండలం ఏతూరు పంచాయతీ నల్లగుట్లపల్లెకు చెందిన గంగులప్ప(95), అతని భార్య అక్కులమ్మ కలసి జీవనం సాగిస్తున్నారు. వీరికి ఏకైక కుమారుడైన అన్నయ్య మద్యానికి బానిస కావడంతో అతడి భార్య పుష్పావతి కుటుంబాన్ని పోషిస్తోంది. వృద్ధులైన తమపై ఇటీవల కొట్టి ఇంటిలో నుంచి అన్నయ్య భార్య, కుమార్తె, ఆమె భర్త మనోహర్‌లు బయటకు గెంటివేశారని వాపోయారు. తమను చంపివేస్తామని, ఖాళీ పేపర్‌పై తమ బొటనవేలుతో ముద్రలు వేయించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు మాకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు.

రూ.1.87 కోట్లకు పార్కింగ్ ఫీజు వేలం

ఐరాల(కాణిపాకం), జూలై 3: కాణిపాకంలో పార్కింగ్ ఫీజు వసూలు చేసే హక్కును రూ.1,87,29,999కు కైవసం చేసుకున్నారు. పంచాయతీ, ఆలయ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన వేలంలో వడ్రాంపల్లె పంచాయతీ మిట్టఇండ్లకు చెందిన ఆర్.మనోహర్‌నాయుడు కుమారుడు సురేష్ హెచ్చు పాటదారుడిగా నిలిచి పార్కింగ్ వసూలును కైవసం చేసుకున్నారు. కాణిపాకం పంచాయతీ కార్యదర్శి సత్యంరెడ్డి పాల్గొన్నారు.

సీఎం పర్యటన అర్జీలను త్వరగా పరిష్కరించండి

చిత్తూరు కలెక్టరేట్, జూలై 3: గతనెల 25, 26 తేదీల్లో కుప్పం పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబుకు స్థానిక ప్రజలు అందించిన 1,140 అర్జీలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఆయన సమీక్షించారు. సీఎం రెండు రోజుల పర్యటనలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నివేదికను సిద్ధం చేయాలన్నారు. శాఖల వారీగా ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ వివరాలను జత చేయాలన్నారు. ఈ సమావేశంలో జేసీ శ్రీనివాసులు, డ్వామా పీడీ రాజశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ప్రవీణ్‌కుమార్

ఐరాల(కాణిపాకం), జూలై 3: ఉమ్మడి చిత్తూరు జిల్లా రేషన్ డీలర్ల సంఘ అధ్యక్షుడిగా ఎంఎల్.ప్రవీణ్‌కుమార్ ఎన్నికయ్యారు. కాణిపాకంలోని ఓ కల్యాణ మండపంలో బుధవారం ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా రవిచంద్రబాబు, ప్రధాన కార్యదర్శిగా వేణుగోపాల్‌ను, కోశాధికారిగా రవిని ఎన్నుకున్నారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. చిత్తూరు డివిజన్ అధ్యక్షుడు జయరామ్‌నాయుడు పాల్గొన్నారు.

నీరనుకుని యాసిడ్ తాగి డ్రైవర్ మృతి



చంద్రశేఖర్ (ఫైల్‌ఫొటో)

బంగారుపాళ్యం, జూలై 3: మద్యం మత్తులో తాగే నీరు అనుకుని యాసిడ్ తాగి డ్రైవర్ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పాలేరు గ్రామానికి చెందిన చంద్రశేఖర్(40) మొగిలిలోని ఒక కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల ఒకటో తేదీన అధిక మోతాదులో మద్యం తాగి ఇంటికి వచ్చాడు. బాత్‌రూమ్‌ను శుభ్రపరిచేందుకు ఉంచిన యాసిడ్‌ను నీరు అనుకుని తాగేశాడు. వాంతులవుతుండడంతో కుటుంబ సభ్యులు తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో పురిటిబిడ్డ మృతి

వైద్యుల అలసత్వమంటున్న తల్లిదండ్రులు ● విచారణ జరిపిన వైద్యఆరోగ్యశాఖ అధికారులు





బిడ్డ మృతిపై తల్లి పూర్ణిమను అడిగి వివరాలు తెలుసుకుంటున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ మురళీకృష్ణ - మృతి చెందిన మగబిడ్డ

పుత్తూరు అర్బన్/కార్వేటినగరం, జూలై 3: పొత్తిళ్లలోనే ఆ బిడ్డకు నూరేళ్లు నిండాయి. కళ్లు విప్పి లోకం చూడకనే లోకం విడిచివెళ్లిపోయాడు. పుట్టిన మరునాడే విగతజీవుడయ్యాడు. వైద్యుల అలసత్వం కారణంగానే ఈ ఘోరం జరిగిందని బిడ్డ తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ సంఘటనపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు విచారణ జరిపారు. వివరాల్లోకి వెళితే.. కార్వేటినగరం మండల పరిధిలోని ద్వారకానగరానికి చెందిన జి.నరేష్ భార్య పూర్ణిమ పురిటి నొప్పులతో తొలి కాన్పు కోసం సోమవారం సాయంత్రం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి వచ్చారు. అదే రోజు రాత్రి ఆమెకు గైనకాలజిస్ట్ హిమబిందు కాన్పు చేయడంతో మగబిడ్డను ప్రసవించింది. మంగళవారం రాత్రి రౌండ్స్‌కు వచ్చిన డాక్టర్ దినేష్ బిడ్డ ఉలుకుపలుకు లేకుండా ఉండడంతో ప్రత్యేక వార్డుకు తీసుకెళ్లి పరీక్షలు జరిపారు. అరగంట తరువాత బిడ్డ మృతి చెందినట్లు చెప్పడంతో పూర్ణిమ దంపతులు నిశ్చేష్టులయ్యారు. బిడ్డ లేడనే విషయం తెలిసి పూర్ణిమ సొమ్మసిల్లిపడిపోయింది. కాన్పు తరువాత వైద్యులు, నర్సులు బిడ్డ ఆరోగ్య పరిస్థితిని పట్టించుకోలేదని బిడ్డ తల్లిదండ్రులు ఆరోపించారు. కనీసం పూటకు ఒక్కసారి కూడా వచ్చి బాలింతను, బిడ్డను పరీక్షించలేదన్నారు. ఈ కారణంగానే తమ బిడ్డ మృతి చెందాడని కన్నీటిపర్యంతమయ్యారు. ఇది జరుగుతుండగానే డ్యూటీ డాక్టర్ అశోక్‌కు బాధిత బంధువుల మధ్య తీవ్రస్థాయిలో వాదోపవాదాలు జరిగాయి. దీంతో ఆసుపత్రి ఆవరణం అరుపులు, కేకలతో దద్దరిల్లింది.

జిల్లా అధికారుల విచారణ

పురిటి బిడ్డ మృతి చెందిన సంఘటనపై బుధవారం డీసీహెచ్ఎస్ డాక్టర్ మురళీకృష్ణ విచారణ జరిపారు. బిడ్డ తల్లిదండ్రులు, వైద్యులతో పాటు నర్సులను వేరువేరుగా విచారించారు. దీనిపై ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మంగళవారం రాత్రి 10గంటల సమయంలో బిడ్డ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని గుర్తించిన డాక్టర్ దినేష్ కృత్రిమ శ్వాస ఇచ్చేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. బిడ్డ పాలు తాగినప్పుడు ఊపిరితిత్తుల్లోకి వెళ్లడంతో మృతి చెందినట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. సమగ్ర నివేదికను కలెక్టర్‌కు అందించి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తిరుపతి ఆర్డీవో నిశాంత్‌రెడ్డి కూడా బుధవారం ప్రభుత్వ ఆసుపత్రిలో పసిబిడ్డ మృతిపై విచారణ జరిపారు. బాధితులు చిత్తూరు జిల్లా, కార్వేటినగరం మండలంకు చెందిన వారు కావడంతో తహసీల్దారు పుష్పకుమారి ప్రభుత్వ ఆసుపత్రిలో పసిబిడ్డ మృతదేహానికి పంచనామా నిర్వహించారు. బిడ్డ తల్లిదండ్రులు, వైద్యులు, నర్సులను సైతం విచారించి వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేశారు. నివేదికను చిత్తూరు కలెక్టర్‌కు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు.

'మొరవను మింగేశారు'పై విచారణ



పుంగనూరు వద్ద తీగలమ్మచెరువును పరిశీలిస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పుంగనూరు, జూలై 3: పుంగనూరు బైపాస్‌రోడ్డులో తీగలమ్మచెరువు మొరవ ఆక్రమణలు, జేన్యూటౌన్ వెంచర్ అక్రమాలపై విచారించి నివేదిక పంపాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో 'మొరవను మింగేశారు' శీర్షికన ప్రచురితమైన కథనంపై కలెక్టర్ తీవ్రంగా స్పందించారు. తీగలమ్మ చెరువునుంచి జేన్యూటౌన్ వెంచర్ స్థలం నుంచి వెళ్లే మొరవపై మూడు సిమెంట్ పైపులతో మొరవ కుదించడం, తీగలమ్మచెరువులో బావులు తలపించేవిధంగా మట్టి తవ్వకాలు, వెంచర్ స్థలాన్ని తహసీల్దారు శివయ్య, ఇరిగేషన్ ఏఈ బాబురాజేంద్రప్రసాద్ సందర్శించారు. వెంచర్ స్థలంలో మొరవలో సిమెంట్ పైపులు సొంతనిధులతో ఏర్పాటుకు పలమనేరు ఇరిగేషన్ ఈఈ అనుమతి ఇచ్చారని, వెంచర్ ఏర్పాటుకు అన్ని అనుమతులు ఉన్నాయని నిర్వాహకులు అధికారులకు తెలిపారు. వెంచర్ యాజమాన్యం వద్ద ఉన్న అనుమతుల పత్రాలు, వెంచర్‌లో చేపట్టిన పనులు గురించి, బైపాస్‌రోడ్డు వద్ద బ్యూటిఫికేషన్, రోడ్లు, చెట్లు తహసీల్దార్ పరిశీలించి కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు సంఘటన స్థలం నుంచే ఫోన్‌లో సమాచామిచ్చారు. వెంటనే సమగ్రంగా తమకు నివేదిక అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ వసీం, సర్వేయర్లు ప్రకాశ్, దేవిక, జ్యోతి, వీఆర్వోలు విజయకుమార్‌రెడ్డి, రత్నప్ప పాల్గొన్నారు.

కార్పొరేషన్ రోడ్డుకు పెద్దిరెడ్డి గేట్లు !

దగ్గరదారికోసం తెరవాలంటున్న రెండు కాలనీల జనం



కార్పొరేషన్ రోడ్డుకు అడ్డుగా పెట్టిన గేట్లు

తిరుపతి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థ నిధులతో 18వ డివిజన్ పరిధిలో మారుతీనగర్- రాయల్ నగర్ ప్రాంతాలను కలుపుతూ వేసిన రోడ్డు అందుబాటులో లేక మూడున్నరేళ్లుగా ప్రజలు ఎదురు చూస్తున్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి తన ఇంటి ముందు సామాన్య ప్రజలు ఎవరూ రాకపోకలు సాగించకూడదని రెండు వైపులా పెద్ద గేట్లు ఏర్పాటు చేసేశారు.వైసీపీ పాలనలో దాదాపు రూ.80లక్షల ప్రజాధనాన్ని వెచ్చించి పెద్దిరెడ్డి ఇంటి చుట్టూ సిమెంటు రోడ్లు వేశారు. మారుతీనగర్-రాయల్ నగర్ ప్రాంతాలను కలిపేందుకు సీసీ రోడ్డు వేస్తున్నట్టు రూ9.55 లక్షల అంచనాతో (ఐఎఫ్‌బి నెం45/19-20)ఒకటి, రూ9.50లక్షలతో (ఐఎఫ్‌బి నెం.46/19-20) మరొకటి రెండు విడతలుగా నామినేటెడ్ కింద టెండరిచ్చారు.నాణ్యతలో ఏమాత్రం రాజీపడకుండా సిమెంట్ రోడ్డును వేశా రు. స్థానికుల విజ్ఞప్తి మేరకు రాయల్‌నగర్ నుంచి మారుతీనగర్‌ను కలుపుతూ రోడ్డు వేస్తున్నట్టు కార్పొరేషన్ రికార్డుల్లో నమోదైవుంది.ఆ వీధి నుంచి ఈ వీధికి కొత్త రోడ్డుద్వారా దాదాపు 300 మీటర్లు ప్రయాణిస్తే సరిపోతుంది. లేదంటే కిలోమీటరుకు పైగా చుట్టుకుని వెళ్లాల్సి వుంటుంది.కానీ రోడ్డు వేసిందే తడవుగా మాజీ మంత్రి ఇరువైపులా రెండు బలమైనగేట్లు పెట్టించేశారు.ఆయనతో పాటు వారి అనుచరుల వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుంది. మంత్రి ఇంటి సమీపంలో వున్న బండారు ఆంజనేయ స్వామి ఆలయానికి పక్కన రోడ్డుకు రూ9.71 లక్షల (ఐఎఫ్‌బి నెం:170/19-20) అంచనాతో ఒకటి, ఆలయానికి దక్షిణం వైపు రోడ్డు రూ9.90లక్షల అంచనాతో ఒకటి (ఐఎఫ్‌బి నెం:205/19-2), దీంతోపాటు రూ4.65లక్షలతో 8-49/1 నుంచి ఎయిర్‌బైపాస్ రోడ్డుకు చేరేలా మరో రోడ్డు పనులకు అంచనా వేసి నామినేషన్ కింద టెండరిచ్చి ఆగమేఘాల మీద పనులను పూర్తిచేశారు.ఈ మూడు రోడ్లు స్థానికులకు అందుబాటులో వున్నాయి. పెద్దిరెడ్డి గేట్లు వేసి మూసేసిన రోడ్లుకూడా అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.ఈ విషయమై గత సోమవారం జరిగిన గ్రీవెన్స్ డేలో టీడీపీ నేతలు కమిషనర్‌కు వినతిపత్రం కూడా అందజేశారు.

నేడు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి మండల స్థాయి సమీక్ష

కలికిరి, జూలై 3: ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి గురువారం కలికిరి మండల స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రామకృష్ణయ్య తెలిపారు. ఉదయం 10 గంటలకు అన్ని శాఖలకు చెందిన అధికార్లతో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వివిధ అంశాలపై సమీక్షలు చేయనున్నట్లు చెప్పారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని కోరారు. ఆయా శాఖలకు చెందిన అధికారులు పూర్తి సమాచారంతో కూడిన ప్రగతి నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

వ్యక్తి ఆత్మహత్య

వాల్మీకిపురం, జూలై 3: ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు పుంగనూరుకు చెందిన ఎం.నరసింహులు(40) మెడికల్ షాపు నిర్వహిస్తుంటాడు. బుధవారం సాయంత్రం వాల్మీకిపురం ఇందిరమ్మ కాలనీ సమీపంలోని రైల్వే ట్రాక్ పక్కన ఉన్న చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పశువుల కాపర్లు సమాచారం అందించడంతో ఎస్ఐ నాగేశ్వర్‌రావ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, నరసింహులు ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

మహిళపై దాడి.. ఇద్దరిపై కేసు నమోదు

కలకడ, జూలై 3: దివ్యాంగురాలైన దేవి అనే మహిళపై దాడి చేసినందుకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. కదిరాయచెరువు పంచాయతీ బొంతలవారిపల్లెకు చెందిన బాబు భార్య దేవి పుట్టింటి వారికి ఎనుగొండపాలెం పంచాయతీ గుండావాండ్లపల్లెకు చెందిన వీరనాగప్పనాయుడుకు భూ తగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో దేవి తన తండ్రి పొలం వద్ద పశువులు మేపుతుండగా వీరనాగప్పనాయుడు అతని భార్య కాంతమ్మ, తమ్ముడి కుమారుడు నాగేశ్వర నాయుడు ఆమెపై దాడి చేసి గాయపరిచారు. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

న్యాయం కోసం వెళితే దాడి చేశారు

● సీఐ, ఎస్ఐ దాష్టీకంపై బాధితుడి ఆవేదన



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న బాధితులు

మదనపల్లె అర్బన్, జూలై3: న్యాయం కోసం పోలీసు స్టేషన్‌కు వెళితే సీఐ, ఎస్ఐ దాడి చేశారంటూ నాగేశ్వర్ నాయుడు అనే యువకుడు తన గోడును వెళబుచ్చాడు. బుధవారం సీపీఐ, ఏఐటీయూసీ నాయకుడు సాంబశివతో కలసి బాధితుడు స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వివరాలు వెల్లడించాడు.. కలకడ మండలం, ఎనుగుండపాళెం గ్రామం, గుండ్లావారిపల్లె రెవెన్యూ సర్వేనెంబరు 772-ఎ లో 12.30 ఎకరాల భూమి టి. నాగప్ప నాయుడు పేరిట ఉంది. బత్తల చిన్నప్ప అనే వ్యక్తి తమ భూమిలో ఓ ఎకరం ఆక్రమించాడంటూ నాగప్ప నాయుడు కలకడ పోలీస్‌స్టేషన్‌ల్లో పలుమార్లు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు. తన భూమి చుట్టూ కంచె వేసేందుకు ఆక్రమణదారులు అడ్డువస్తున్నారంటూ ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో చిన్నప్ప వర్గీయులు 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారంటూ నాగప్పనాయుడును పోలీసు స్టేషన్‌కు పిలిపించారు. దీంతో నాగప్పనాయుడు కుమారుడు నాగేశ్వర్‌నాయుడు పోలీసు స్టేషన్‌కు వెళ్లాడు. తమ భూమి ఆక్రమణ విషయం ప్రస్తావించగా సీఐ, ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ సెల్‌ఫోన్ లాక్కుని, గట్టిగా అరుస్తూ దాడి చేసి భయభ్రాంతులకు గురిచేశారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయంగా ఉన్నతాధికారులు విచారించి, పోలీసులపై చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని సీఐటీయూ నాయకుడు డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేయకపోతే పోలీసుస్టేషన్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు.

వైభవంగా ఎర్రగుంట్ల గంగమ్మ జాతర


దివ్వెలు, బోనాలను తీసుకువెళుతున్న మహిళలు

తంబళ్లపల్లె, జూన్ 3: తంబళ్లపల్లె మల్లయ్యకొండ దారిలోని పొలాల్లో బుధవారం స్థానికులు ఎర్రగుంట్ల గంగమ్మ జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. స్థానిక మహిళలు భక్తి శ్రద్ధలతో దివ్వెలూ, బోనాలను తలపైన పెట్టుకుని ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. తంబళ్లపల్లె గ్రామస్తులు రాత్రి చాందినీ బండి కట్టి అమ్మవారి ఆలయం చుట్టూరా తిప్పి మొక్కులు తీర్చుకున్నారు.

బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల సంఘం కార్యదర్శిగా షేక్ మహమ్మద్

మదనపల్లె అర్బన్, జూలై3:బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల సంఘం కార్యదర్శిగా షేక్ మహమ్మద్ బాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం మదనపల్లె బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో నిర్వహించిన ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, మదనపల్లె శాఖ సర్వసభ్య సమావేశంలో రిటైర్డ్ ఆఫీస్ సూపరింటెండెంట్ షేక్ మహమ్మద్ బాషాను ఎన్నుకున్నారు. అధ్యక్షుడు రత్నశేణి, కోశాధికారి రెడ్డెప్ప ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సౌందర్‌రాజన్, ఇతర జిల్లా నాయకులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన

మదనపల్లె అర్బన్, జూలై 3: మత్తు పదార్థాల వినియోగంపై స్థానిక రామిరెడ్డి లేవుట్‌లోని వివేకానంద మున్సిపల్ హైస్కూల్‌లో బుధవారం వన్‌టౌన్ ఎస్ హరిహరప్రసాద్ అవగాహన కల్పించారు. చాలా చోట్ల యువత మత్తుకు బానిసలుగా మారుతున్నారని తెలిపారు. కార్యక్రమం లో స్కూల్ హెచ్ఎం రాజేంద్రబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు యోగభోగేశ్వరుడికి రుద్రాభిషేకం

మదనపల్లె అర్బన్, జూలై 3: స్థానిక చిప్పిలి గ్రామంలోని మడికయ్యల శివాలయంలో గురువారం యోగ భోగేశ్వరుడికి రుద్రాభిషేకం నిర్వహి స్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు విశ్వేశ్వర ప్రసాద్ తెలిపారు. మాస శివరాత్రి పురస్కరించుకుని విశేష పూజలు జరుగుతాయని తెలియజేశారు.

'ఉపాధి' కంటే హౌసింగ్‌కే ఎక్కువ వ్యయం

● సామాజిక తనిఖీ వేదికపై పీడీ మద్దిలేటి


వేదికపై డ్వామా పీడీ మద్దిలేటి, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ

మదనపల్లె టౌన్, జూలై 3: ఉపాధి హామీ పథకం పనుల కంటే హౌసింగ్ పనులకే ఎక్కువ నిధులు ఖర్చు చేశారని డ్వామా పీడీ మద్దిలేటి వివరించారు. మదనపల్లె మండలంలో 2023-24 సంవత్సరంలో రూ.8.15 కోట్ల అంచనా మొత్తంతో నిర్వహించి జాతీయ ఉపాధి హామీ పనులపై బుధవారం సామాజిక తనిఖీ సమావేశం నిర్వహించారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ బహిరంగ సభలో 26 గ్రామ పంచాయతీల్లో డీఆర్‌పీలు తనిఖీ చేసి ఇచ్చిన నివేదికలపై కూలీలు, ప్రజలు, ప్రజాప్రతినిధుల సమక్షంలో విచారణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె మండలంలో ఉపాధి పనుల కంటే, ఈ పథకానికి అనుసంధానంగా వున్న హౌసింగ్ పథకానికే ఎక్కువ డబ్బులు ఖర్చు పెట్టారన్నారు. చాలా పనులకు ఐడీనెంబర్లు వేయలేదని, రికార్డులు సక్రమంగా నిర్వహించలేదన్నారు. ఉద్యాన పథకంలో నాటిన మొక్కలు పలుచోట్ల బతకలేదని, వాటిని తిరిగి నాటించి రైతులతో సంరక్షించాలన్నారు. మండలంలో ఎనిమిది మంది సామాజిక భద్రతా పింఛన్లకు అనర్హులుగా సామాజిక తనిఖీ బృందం గుర్తించిందని దీనిపై విచారించి డీఆర్‌డీఏ అధికారులకు నివేదికలు పంపాలన్నారు. మొత్తం మీద 3,568 ఉపాధి పనుల్లో రూ.7,336 రికవరీకి ఆదేశించామన్నారు. ఉపాధి పనులు నిర్వహించిన చోట్ల బోర్డులు ఏర్పాటు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే సంవత్సరంలో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని సూచించారు. ఖాళీగా వున్న 14 ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని ఆదేశించారు. డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, ఏపీడీ ప్రకాష్, ఎంపీడీవో భానుప్రసాద్, ఏపీడీ మధుబాబు, డీపీఎం ధర్మరాజు, ఏపీవో సుబ్రమణ్యం, పీఆర్ ఏఈ రమణ, ఎస్ఆర్‌పీ మూర్తి, ఉపాధి హామి సిబ్బంది పాల్గొన్నారు.

తీరనున్న సివిల్ సప్లై గోడౌన్ దారి సమస్య


రోడ్డు ఏర్పాటును పరిశీలిస్తున్న ఆర్ఐ, సర్వేయర్

మదనపల్లె, జూలై 3: మదనపల్లె సివిల్ సప్లయ్ గోదామునకు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ రహదారిని బుధవారం అధికారులు పరిశీలించారు. స్థానిక టమోటా మార్కెట్ ఆనుకుని ఉన్న ఈ గోదాము లోనికి లారీలు వెళ్లాలన్నా..బయటకు రావాలన్నా ట్రాఫిక్ సమస్య కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జూన్ నుంచి ఆగస్టు వరకూ టమోటా మార్కెట్ చాలా రద్దీగా ఉంటుంది. దీంతో లారీలే కాదు.. ద్విచక్ర వాహనం వెళ్లాలన్నా వీలు కావడం లేదు. టమోటా వ్యాపారులు మార్కెట్ లోపల ఎక్కడపడితే అక్కడ లారీలు, ట్రాక్టర్లు నిలిపేయడంతో ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. ఈ ప్రభావం రేషన్ బియ్యం రవాణా వాహనాలపై పడుతోంది. స్టేజీ-1 నుంచి వచ్చే లోడు లారీలు లోపలికి ఒకసారి వస్తే. .అన్‌లోడ్ చేసి బయటకు వెళ్లడానికి సాయంత్రం అవుతోంది. అలాగే స్టేజీ-2 నుంచి రేషన్ షాపులకు సరుకులు తోలాలన్నా.. ఇదే పరిస్థితి. దీంతో ఒకటో తేదీ నుంచి 17వ తేదీ వరకూ కార్డుదారులకు నిత్యావసర సరుకులు ఇవ్వడానికి వీలు కావడం లేదు. సకాలంలో స్టాకు చౌకదుకాణాలకు చేరకపోవడంతో ఎండీయూ వాహనాలకు కూడా సకాలంలో అందడం లేదు. ఈ సమస్య ప్రతి ఏడాది గోదాము అధికారులను వెంటాడుతోంది. తాజాగా నెల రోజులుగా ఇదే సమస్య పునరావృతం కావడంతో సివిల్ సప్లయ్ గోదాము డీటీ సుబ్రహ్మణ్యం, కాంట్రాక్టర్ మోహన్‌రెడ్డి ఈ విషయాన్ని అటు తహసీల్దార్, ఇటు ఆర్డీవో హరిప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే సమస్యను పరిశీలించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దారి ఒకటే ఉండటంతో ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలన్నారు. దీనిపై ఆర్ఐ రెడ్డెప్ప, పట్టణ, మండల సర్వేయర్లు పూర్ణచంద్, బి.వి.సుబ్రహ్మణ్యంబుధవారం మార్కెట్ యార్డు, మ్యాంగో మార్కెట్, గోదాము ఏరియాలలో పర్యటించారు. ఈ సందర్భంగా గోదాము డీటీ సుబ్రహ్మణ్యం, కాంట్రాక్టర్ మోహన్‌రెడ్డితో చర్చించారు. సమస్య పరిష్కారానికి మార్గాలపై చర్చించారు. పాత నీరుగట్టువారిల్లె గుండా ఒకమార్గం, మ్యాంగోమార్కెట్ గుండా మరో మార్గం ఏర్పాటు చేయాలని స్కెచ్‌లు సిద్ధం చేశారు. ఆర్డీవో ఈ రెండింటిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. కార్యక్రమంలో నీరుగట్టువారిపల్లె వీఆర్వో వెంకటరమణ పాల్గొన్నారు.

గురుకుల విద్యా విధానాన్ని పునరుద్ధరించాలి

● కూడలి శృంగేరి మహాసంస్థానం పీఠాధిపతి అభినవశంకర భారతి


ధార్మికోపన్యాసం చేస్తున్న అభినవ శంకరభారతి స్వామి

బి.కొత్తకోట, జూలై 3: గురుకుల విద్యావిధానాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని కూడలి శృంగేరి మహాసంస్థానం, దక్షిణామ్నాయ శారదాపీఠం 72వ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ అభినవ శంకరభారతి స్వామి తెలిపారు. మండలంలోని గట్టు పంచాయతీలో వేద వ్యాస భారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రుషి వాటిక గురుకులాన్ని ఆయన సందర్శించారు. గురుకుల భవనానికి భూమి పూజచేశారు. అనంతరం వేదాలు, సనాతనధర్మం, గురుకులాలు, ప్రస్తుత విద్యా విధానాలు, నైతిక విలువలు, పీఠాలస్థాపన, వాటి ఆవశ్యకత, భారతీయ సంప్రదాలు తదితర అంశాలపై ధార్మికోపన్యాసం చేశారు. కార్యక్రమంలో వేద వ్యాస ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ జీయస్‌రాజు, ట్రస్టీలు శాంతారాణి, గంగాధర్, ఉమాభారతి, గురుకుల నిర్వాహకులు రవికుమార్‌శర్మ, ఆచార్యులు రాకేష్, గాయత్రీభరద్వాజ, వెంకట్, విశ్వం విద్యాసంస్థల అధినేత ప్రభాకర‌రెడ్డి, ప్రకృతివనం ప్రసాద్, రాఘవన్ రఘురాం, యంఈవో రెడ్డిశేఖర్, వైద్యసంఘం రాష్ట్ర అధ్యక్షులు సుబ్బారెడ్డి, ప్రొఫెసర్ ముప్పాళ్ల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికల గురుకులాల్లో ప్రవేశానికి కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న కన్వీనరు సోమశేఖర్

కలికిరి, జూలై 3: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలల్లో మిగులు సీట్లు భర్తీకి బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. పీలేరు, కలికిరి, పెద్ద పంజాణి, పులిచెర్ల, ఉదయమాణిక్యం పాఠశాలలకు సంబంధించి మిగులు సీట్లు భర్తీ చేయ డానికి 1:2 నిష్పత్తిలో బాలికలు హాజరయ్యారు. ఈ ఐదు పాఠ శాలల్లో 6వ తరగతిలో 64 మిగులు సీట్లు, 7వ తరగతిలో 21 సీట్లు, 8వ తరగ తిలో 23 సీట్లు, 9వ తరగతిలో 14 సీట్లతో కలిపి మొత్తం 122 ఖాళీల భర్తీ కోసం కన్వీనరు, కలికిరి బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వై.సోమశేఖర్ బహిరంగా కౌన్సెలింగ్ ద్వారా పారదర్శకంగా ఎంపికలు పూర్తి చేశారు. ఈ కౌన్సెలింగ్ కార్యక్రమానికి పీలేరు, కలికిరి, పెద్దపంజాణి, పులిచెర్ల, ఉదయ మాణిక్యం పాఠశాలల ప్రిన్సిపాళ్ళు రాధా రాణి, సోమశేఖర్, జ్యోత్స్న, సునీత, గీతాంజలి హాజరయ్యారు. ఎంపికయిన బాలురు, బాలికలు ఆయా పాఠశాలల్లో గురువారం నుంచి వారం రోజుల్లో (11వ తేదీ లోగా) ప్రవేశాలు తీసుకోవాలని కన్వీనరు సోమశేఖర్ కోరారు.

ఓఆర్‌లో ఆర్టీసీ వన్ డిపోకు ప్రథమ స్థానం


గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న డీఎం వెంకటరమణారెడ్డి

మదనపల్లె అర్బన్, జూలై3: మదనపల్లె వన్‌డిపో జూన్ నెలలో ఓఆర్‌లో రీజియన్‌లోనే ప్రథమ స్థానంలో నిలిచిందని వన్‌డిపో మేనేజరు తెలిపారు. బుధవారం స్థానిక డిపోలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె వన్ డిపో 70.29 ఓఆర్ సాధించి ప్రథమస్థానంలో, టూ డిపో 68.25 ఓఆర్‌తో ద్వితీయ స్థానంలో నిలిచాయన్నారు. జూలైలో కూడా 70 శాతం కంటే ఎక్కువ సాధించాలన్నారు.డిప్యూటీ సీఎంఈ మదనపల్లె టూ డిపో గ్యారేజ్‌ను సందర్శించి అవసరమైన మెటీరియల్స్, ఇంజన్స్ యూనిట్స్, స్పేర్స్ తెప్పిం చడానికి స్వయంగా అధికారులతో మాట్లాడారు. అన్ని మార్గాల్లో రిక్వెస్ట్ స్టాప్‌లో ప్రయాణికులను ఎక్కించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు గీతా, రేవతి, ఎంఎఫ్ రవి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మహిళలకు విద్యతోనే సామాజిక భద్రత

మదనపల్లె టౌన్, జూలై 3: మహిళలకు విద్యతోనే సామాజిక భద్రత వస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజ అన్నారు. సీఆర్‌వై, ఫోర్డ్ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న "పూరి పడాయ్..దేశ భళాయ్" కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని చైర్‌పర్సన్ చాంబర్‌లో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, ఓ మహిళ చదువుకుంటే ఆ కుటుంబమంతా ఉన్నత స్థితికి చేరుకుంటుందన్నారు. కొన్ని ప్రాంతాల్లో బాలికలను చదువు మధ్యలోనే నిలిపివేస్తున్నారని, దీంతో ఆమె భవిష్యత్ అంధకారంలో పడిపోతోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి, ఫోర్డు డైరెక్టర్ లలితమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలి


వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ

వాల్మీకిపురం, జూలై 3: వాహన చోదకులు తప్పనిసరిగా రోడ్డు నిబంధ నలు పాటించాలని వాల్మీకిపురం ఎస్ఐ నాగేశ్వర్‌రావ్ తెలిపారు. బుధవారం ఆయన పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్ద వాహనాల తనిఖీలు చేశారు. రికార్డులు లేని పలు వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన చోదకులు విధిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టరీత్యా వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వడం సరదా కాకూడదని తరువాత ఏదైనా ప్రమాదం జరిగితే తల్లిదండ్రులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఇకపై నిత్యం నిఘా ఉంటుందని వాహనాల రికార్డులు సక్రమంగా లేకపోయినా జరిమానాలు, కేసులు తప్పవని తెలియజేశారు.

గ్రూప్ టెంపుల్స్ హుండీల లెక్కింపు


హుండీలోని కానుకలు లెక్కిస్తున్న ఈవో రమణ, తదితరులు

మదనపల్లె అర్బన్, జూలై 3: మదనపల్లెలోని గ్రూప్ టెంపుల్స్‌లో బుధవారం హుండీ లెక్కింపు నిర్వహించినట్లు ఈవో రమణ తెలిపారు. చిప్పిలి గ్రామంలోని మడియక్యల శివాలయం యోగభోగేశ్వరస్వామి ఆలయ హుండీ ద్వారా రూ. 1,33,153లు, పుంగనూరు రోడ్డు కనుమలో గంగమ్మ ఆలయ హుండీ ద్వారా రూ. 2,53,023లు వచ్చిందన్నారు. ఆలయ ఈవో రమణతోపాటు సిబ్బంది అంకన్న, రాజశేఖర్, శ్రీ భ్రమరాంబికా సేవా సమితి అధ్యక్షురాలు ధనలక్ష్మీ, నాగముని, విజయమ్మ, ఉషారాణి, అనురాధ, మంగళ, వారాది, హరిత, లక్ష్మీదేవమ్మ, రెడ్డెమ్మ, శంకర, రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం కిరణ్‌తో బీజేపీ నేతల భేటీ


మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి తో బీజేపీ నాయకులు

బి.కొత్తకోట, జూలై 3: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి, రాజం పేట పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డిని బుధవారం బి.కొత్తకోట మండల బీజేపీ కన్వీనర్ రామదాసు ఆధ్వర్యంలో పలువురు బీజేపీ నాయకులు కలికిరిలోని కార్యాలయంలో కలిసి దుశ్శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా బి.కొత్తకోట మండలానికి రావాల్సిందిగా ఆహ్వానించగా, త్వరలో పర్యటించనున్నట్లు తెలిపారన్నారు. కిరణ్‌ను కలిసిన వారిలో జిల్లా యువ మోర్చా ఉపాధ్యక్షుడు భాను ప్రకాష్, రమణ, శ్రీరాములు,మంజునాథ్‌రెడ్డి తదితరులు ఉన్నారు

మదనపల్లె స్పిన్నింగ్‌మిల్స్ యూనియన్ కార్యవర్గం ఎంపిక



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

మదనపల్లె అర్బన్, జూలై 3: మదనల్లె స్పిన్నింగ్ మిల్స్ యూనియన్ నూతన కార్యవర్గం ఎంపిక చేసినట్లు ఆ యూనియన్ అధ్యక్షుడు నందగోపాల్ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మీడియాకు నూతన కార్యవర్గం వివరాలను తెలిపారు. అధ్యక్షుడుగా నందగోపాల్, ఉపాధ్యక్షుడుగా కృష్ణారెడ్డి, అడ్వైజర్. వి. సదాశివరెడ్డి, జనరల్ సెక్రటరీగా భాస్కర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా సుధాకర్‌రెడ్డి, రమాసుబ్బారెడ్డి, చెన్నారెడ్డి, శివమల్లప్పనాయుడు, ఎంకే మునిరత్నం, ఎం, భాస్కర్‌రెడ్డి, కోశాధికారిగా రవిచంద్రను ఏకగ్రీవంగా ఎంపిక చేశామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల 26న మదనపల్లె స్పిన్నింగ్ మిల్స్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించామని, అందులో 207 మంది హాజరయ్యారని తెలిపారు. పాత యూనియన్ కమిటీ గత పదేళ్లుగా ఎలాంటి సర్వసభ్య సమావేశాలు నిర్వహించ లేదన్నారు. కమిటీ ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకుని కార్మికులకు అన్యాయం చేశారని ఆరోపించారు. ఇందుకు కారణమైన పాత కమిటీని రద్దు చేస్తూ నూతన కమిటీని ఎంపిక చేశామన్నారు. కోర్టుల చుట్టూ తిరగడం వలన కార్మికులకు చాలా నష్టం కలిగిందన్నారు. పాత కమిటీ వారు రికార్డులను కొత్త కమిటీకి అప్పగించాలని కోరారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం


సీఎం, డిప్యూటీ సీఎం, నారా లోకేశ్, నల్లారి చిత్రపటాలకు పాలతో అభిషేకం చేస్తున్న ఉపాధ్యాయులు

పీలేరు, జూలై 3: మెగా డీఎస్సీ, 1వ తేదీన జీతాలు చెల్లించడంపై బుధవారం పీలేరులోని పలువురు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి చిత్రపటాలకు స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో పాలతో అభిషేకం చేసి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రెడ్డిరమేశ్, ఏపీసీపీఎస్ఈఏ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు పచ్చార్ల సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వంలోకి వస్తూనే మెగా డీఎస్సీ, గత నాలుగున్నరేళ్లలో లేని విధంగా 1వ తేదీన జీతాలు చెల్లించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట నిలబెట్టుకున్నారని తెలిపారు. ఆయన పరిపాలనలో రాష్ట్రంలోని ఉద్యోగులందరూ సుఖసంతోషాలు, మానసిక ప్రశాంతతతో ఉండగలరన్న ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నేతలు పోతంశెట్టి రమేశ్, సురేశ్, అమరనాథ్, కిశోర్ కుమార్, జయప్రకాశ్, జయపాల్ రెడ్డి, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

పని వేళలు పాటించకుంటే చర్యలు


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో పోలప్ప

ములకలచెరువు, జూలై 3: పని వేళలు పాటించకుంటే చర్యలు తప్పవని ఎంపీడీవో పోలప్ప ఆదేశించారు. ములకలచెరువు, పాత ములకలచెరువు సచివాలయాలను, గుడుపల్లె అంగన్‌వాడీ కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాలల ను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు అనుమతులు లేకుండా విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ తనిఖీల్లో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ములకలచెరువులో 99.28 శాతం పింఛన్లు పంపిణీ

ములకలచెరువు, జూలై 3: మండలంలో బుధవారం నాటికి 99.28 శాతం పింఛన్లను పంపిణీ చేసినట్లు ఎంపీడీవో పోలప్ప తెలిపారు. మండలంలో 6759 మంది లబ్ధిదారులుండగా 6710 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ములకలచెరువు -1 లో 617 మందికి గానూ 615 మందికి, ములకలచెరువు - 2లో 380కి 380, బురకాయలకోట-1లో 517కి 515, బురకాయలకోట-2లో 287కి 287, కదిరినాధునికోటలో 433కి 432, కాలువపల్లెలో 338కి 337, చౌడసముద్రంలో 490కి 488, సోంపల్లె -1లో 586కి 580, సోంపల్లె -2లో 431కి 429, మద్దినాయనిపల్లె-1లో 507కి 502, మద్దినాయనిపల్లె-2లో 309కి 307, వేపూరికోటలో 442కి 439, పెద్దపాళ్యంలో 332కి 329, గూడుపల్లెలో 352కి 343 లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసినట్లు వివరించారు.

డెంగీ వ్యాప్తిని నివారిద్దాం..


ర్యాలీలో డాక్టర్లు, సిబ్బంది

కలకడ, జూలై 3:అందరం కలిసి డెంగీ వ్యాప్తిని నివారిద్దామని డాక్టర్లు కిశోర్‌కుమార్‌రెడ్డి, జవహర్‌బాబు తెలిపారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా బుధవారం పాపిరెడ్డిగారిపల్లెలో సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించి గోడ పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ వివిధ వ్యాధులకు కారణమైన దోమల నివారణపై శ్రద్ధ చూపాలన్నారు. జ్వరాల బారిన పడిన బాధితులు వెంటనే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించి వైద్య సేవలు పొందాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది జయరామయ్య, వెంకటేశ్వరరావు, రెడ్డెమ్మలు పాల్గొన్నారు.

పశువుల్లో బొబ్బ, మూర్చవ్యాధికి టీకాలు

నిమ్మనపల్లి, జూలై 3: మండలంలోని పాడి పశువులకు వచ్చే బొబ్బ, మూర్చవ్యాధికి సంబంధించిన టీకాలను గురువారం అన్ని గ్రామాలలో వేయనున్నట్లు పశువైద్యాధికారి సురేష్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సర్వసాధారణంగా పశువులు బొబ్బ, మూర్చవ్యాధికి గురవుతాయన్నారు. ఏడాదికి రెండు సార్లు వీటికి సంబంధించిన టీకాలను కచ్చితంగా వేయించాలని తెలిపారు. మొదట విడతలో మండలానికి 600ల టీకాలు వచ్చాయని తెలిపారు. టమాటా పైరులో అంతర పంటగా సాగు చేస్తున్న పశుగ్రాసంపై పురుగుమందుల అవశేషాలు ఉంటాయని, ఆ గడ్డిని మేసిన ఆవులు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నాయని వివరించారు. అందువల్ల పశుగ్రాసాన్ని ప్రత్యేకంగా పెంచాలని సూచించారు.

మార్కెట్ సెస్సు వేలంతో రూ.3.61 లక్షల ఆదాయం

కురబలకోట, జులై 3: మండలంలోని ముదివేడు గ్రామ పంచాయతీలోని వారపు సంతలో సెస్సు వసూలు హక్కుల వేలంతో పంచాయతీకి రూ.3,61,500 లక్షల ఆదాయం వచ్చింది. బుధవారం ముదివేడు కార్యాలయంలో 9 నెలలకు గానూ వారపుసంత వేలం నిర్వహించారు. ఈవోపీఆర్‌డి షకూర్, కార్యదర్శి రామప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దేవరెద్దు అంత్యక్రియలు


దేవరెద్దు అంత్యక్రియల్లో గ్రామస్థులు

కురబలకోట, జులై 3: మండలంలోని కనసానివారిపల్లె పంచాయతీ దిగువబోయపల్లెలో బుధవారం దేవరెద్దుకు అంత్యక్రియలు నిర్వహించారు. 2004లో జన్మించిన ఎద్దును అప్పట్లో గ్రామ పెద్దలు దేవరెద్దుగా గుర్తించి పూజలు నిర్వహిస్తున్నారు. కాలు జారిపడి మృతి చెందడంతో సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలను నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలసిన ఎన్ఆర్ఐ లోకేశ్


నారా లోకేశ్‌ను కలసిన ఎన్ఆర్ఐ లోకేశ్ కొణెదల

మదనపల్లె టౌన్, జూలై 3: మదనపల్లెలో టీడీపీ బలోపేతానికి తనవంతు కృషి చేసిన టీడీపీ ఎన్ఆర్ఐ లోకేశ్ కొణెదల బుధవారం రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. బుధవారం మంగళగిరిలో మంత్రి కార్యాలయంలో ఆయనకు వెంకటేశ్వర స్వామి ప్రతిమను ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఐదేళ్లలో ఎన్ఆర్ఐ లోకేశ్ కెణెదల టీడీపీ బలోపేతానికి చేసిన కృషి విని మంత్రి లోకేశ్ ఆయనను అభినందించారు. సీబీఎన్ యూత్ నిరంజన్ నాని పాల్గొన్నారు.

మదనపల్లె: రాష్ట్ర ఐటీశాఖ మంత్రి నారా లోకేష్‌ను, కురబలకోట మండల టీడీపీ నాయ కులు విజయవాడలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తుమ్మచెట్లపల్లె సురేంద్ర, పార్టీ మండల అధ్యక్షుడు వైజీ సురేంద్రయాదవ్ ఉన్నారు. ఈ సందర్భంగా ముదివేడు ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన కొత్తపల్లె, పిచ్చలవాండ్లపల్లె, సీతివారిపల్లె, గురికవారిపల్లె రైతులకు నష్టపరిహారం చెల్లించాలని వారుకోరారు. ముదివేడు క్రాస్‌లో పీహెచ్‌సీ, టీడీపీ కళ్యాణ మండపం, మైనార్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

కురబలకోట: విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను విజయవాడలో బుధవారం తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన వైజి. సురేంద్ర, నూరి కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గాలలో నెలకొన్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్ళారు. నియోజకవర్గంలో పర్యటించాలని మంత్రిని కోరగా సానుకూలకంగా స్పందించారు. కాగా ముదివేడు ప్రాజెక్టు రైతులను ఆదుకోవాలని, ముదివేడు క్రాస్ పీహెచ్‌సీ, కురబలకోటలో కళ్యాయణమండపం ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు.

పాఠశాల ముందరే మురుగునీరు నిల్వ...

నిమ్మనపల్లి, జూలై 3: మండ లంలోని ఉర్దూ పాఠశాల ముందు కొన్ని నెలలుగా మురుగు నీరు నిల్వ ఉన్నా అధి కారులు పట్టించుకోవడం లే దని ప్రజలు వాపోతున్నారు. స్థానిక జామియా మసీదు దారిలో మురుగునీరు నిండి పోవడంతో పక్కనే వున్న ఉర్దూ పాఠశాలకు వెళ్లేందు కు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై పలు మార్లు పంచాయతి అధికా రులకు విన్నవించినా స్పందన లేదని ప్రజలు వాపోతున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పెద్దమండ్యం, జూలై 3: గుర్తు తెలియని వాహనం ఢీకొన్ని ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు సిద్దవరం గ్రామ పంచాయతీ గాజులపల్లికి చెందిన మధుకర (60) ద్విచక్రవాహనంలో పెద్దమండ్యం నుంచి స్వగ్రామానికి వెళుతుండగా కలిచెర్ల కోళ్లఫారం సమీపంలోని మలుపులో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయనను పోలీసులు మదనపల్లి ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.